15



## కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించి.. ఆశీర్వదించండి

■ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం ■ కార్నర్ మీటింగ్‌తో దద్దరిల్లిన పట్టణం ■ మోసకారుల మాటలు నమ్మొద్దు
■ ప్రజా ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం ■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్


■ మంగళవారం | 10 ఫిబ్రవరి 2026 | ■ 15 పేజీలు


■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న మునిసిపల్ ఎన్నికల్లో ప్రచార ఘట్టం ముగిసి, కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్ పర్వం మొదలైంది. అధికార, ప్రతిపక్షాల నడుమ హోరాహోరీగా ఎన్నిక జరుగుతుండడంతో ప్రతీ ఓటును రాబట్టేందుకు పార్టీలు, అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఓటర్లను తమవైపునకు తిప్పుకునేందుకు తాయిలాల పంపిణీ ప్రారంభించారు. బలమైన పోటీ ఉన్నచోట ఒకతీరు, నామమాత్రపు పోటీ ఉన్నచోట్ల మరోతీరుగా నగదు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారికంగా ప్రచారం సోమవారం సాయంత్రానికే ముగిసినప్పటికీ వార్డుల్లో విచ్చలవిడిగా మద్యం, నగదు, మాంసం, తాయిలాల పంపకాలు సాగుతున్నాయి. పోలింగ్‌కు గడువు సమీపిస్తుండడంతో గెలుపునకు ఎంతదూరంలో ఉన్నామో అంచనా వేసుకుంటున్న ప్రధాన పార్టీల నేతలు ఆయా వార్డుల్లో అభ్యర్థుల గెలుపుకు అవసరమైన ఓట్లను సమీకరించేందుకు తుది ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆయా వార్డుల్లో ఎక్కువ ఓట్లున్న కుటుంబాల పెద్దలను నేరుగా కలిసి ఓట్లేస్తే ఏం కావాలో అది చేస్తామని హామీ పత్రాలివ్వడమేగాక, నగదు ఎంతడిగితే అంత ఇస్తూ మాట తీసుకుంటున్నారు. మరోవైపు ప్రత్యర్థి పార్టీలో, బరిలో ఉన్న మూడు, నాలుగు స్థానాల్లో నిలుస్తారని భావిస్తున్న అభ్యర్థుల తరపున బలంగా పనిచేస్తున్న కార్యకర్తలు, వారికి అండగా ఉండే ఓటర్లను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నాలు, చర్చలు ప్రారంభించారు.

## మూగబోయిన మైకులు

# నోటికి తాళం.. ఓటుకు బేరం




■ ముగిసిన మునిసిపల్ ప్రచారం
■ ఫుల్‌గా తాగండి.. ఊగండి.. ఓటు మాకే వేయండి
■ గంపగుత్తగా ఓట్ల కొనుగోళ్లకు వ్యూహాలు
■ మొదలైన తాయిలాల పంపిణీ
■ ఓటుకు రూ.1,500 నుంచి రూ.6వేల వరకు
■ మద్యం పంపిణీకి సిద్ధం ■ వార్డుల్లో పార్టీలు
■ కానుకలిచ్చి.. కాళ్లు మొక్కుతున్న వైనం
■ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్న పార్టీలు
■ మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి కింది స్థాయి నాయకుల వరకు అంతా ప్రచారంలోనే
■ గెలుపు ఓటములపై ఎవరి అంచనాలు వారివే
■ రేపు పోలింగ్, 13న కౌంటింగ్

10

## ఎన్నికల నిబంధనలు పాటించాలి



3

■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
■ పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
■ సెల్ ఫోన్లు, వాటర్ బాటిల్స్ అనుమతి లేదు..
■ రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు..

## ఓటు హక్కును వినియోగించుకోవాలి




2

■ జిల్లాలో వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యం
■ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

# మావోయిస్టుల కలకలం

ప్రభాత సమాచారం, ఆసిఫాబాద్

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ ప్రాంతాల్లో మరోసారి మావోయిస్టుల కదలికలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతం నుంచి ఓ మావోయిస్టు దళం జిల్లాలోకి ప్రవేశించినట్లుగా నిఘావర్గాలకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతోంది. ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో గ్రేహౌండ్స్ బలగాలు రంగంలోకి దిగాయి. డోర్లి-పంగిడిమాదారం అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా.. మావోలకు సంబంధించిన కిట్ బ్యాగులు, ఇతర సామగ్రిని బలగాలు గుర్తించాయి. పోలీసుల రాకను గమనించిన మావోలు అడవుల్లోకి తప్పించుకున్నట్లుగా అనుమానిస్తున్నారు.

■ ఆసిఫాబాద్ అడవుల్లో 'గెరిల్లా' అలజడి
■ మహారాష్ట్ర నుంచి జిల్లాలో చొరబడిన దళం
■ గత సర్పంచ్ ఎన్నికల సమయంలోనూ 16 మందిని అరెస్టు చేసిన పోలీసులు
■ మున్సిపల్ ఎన్నికల వేళ హై అలర్ట్
■ సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ బలగాల మోహరింపు



15

## ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలి

5

■ 49 వార్డుల లెక్కింపు కోసం 49 టేబుళ్ల ఏర్పాటు
■ 3నుంచి 4రౌండ్లలో ఫలితాలు వెల్లడించేలా ప్రణాళిక
■ కౌంటింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా వీడియో తీయాలి..
■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్ మున్సిపాలిటీ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్‌తో కలిసి ఆయన దిశానిర్దేశం చేశారు.




## ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా

# ఓటు హక్కును వినియోగించుకోవాలి






- జిల్లాలో వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యం
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**నిర్మల్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ప్రజలంతా మున్సిపల్ ఎన్నికలలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి, ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటరు అవగాహన పెంపొందించుటకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత తెలిపేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ముగిసిన అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని తెలిపారు. ఓటరుకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వివరించారు. ఏ ఎన్నికలు వచ్చిన సంబంధిత ఓటర్లు అందరూ ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని స్ఫూర్తిని చాటారని వివరించారు. ఇదే విధంగా మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని, పట్టణాలలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వారా వార్డుల వారీగా ఓటు హక్కుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ బ్యాంకింగ్ కేవైసీని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ ఉండాలని తెలిపారు. కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవడం వల్ల సైబర్ మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉండగలుగుతామని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారులు పెద్ద ఎత్తున కేవైసీ ప్రక్రియ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలందరూ స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహనకల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న, ఎక్సైజ్ అధికారి ఎంఎ రజాక్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా





**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోని, జిల్లాలో వంద పోలింగ్ శాతం నమోదుకు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, మాజీ సైనికుల సంఘాల ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో నిర్వహించిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కు వినియోగించాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, సమాజంలోని అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా ఓటు వేసేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహనపై తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం ప్రదర్శించిన ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరితో ఓటు హక్కు వినియోగిస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ రాజు, కలెక్టరేట్, సిబ్బంది పాల్గొన్నారు.




# కేవైసీ అప్‌డేట్ చేయించుకోండి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

బ్యాంకింగ్ సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ఖాతాదారులు తమ కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో "మీ కేవైసీని అప్‌టు డేట్ ఉంచండి-అంతరాయం లేని బ్యాంకింగ్ సేవలు పొందండి" అనే అవగాహన పోస్టర్లు, ఫ్లెక్సీలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేవైసీ అప్‌డేట్ చేయకపోతే ఖాతాలపై పరిమితులు విధించే అవకాశం ఉందన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఆధార్, పాన్, ప్రస్తుత చిరునామా వంటి వివరాలను నిర్ణీత వ్యవధిలో బ్యాంకులకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కేవైసీ పేరుతో వచ్చే అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్‌పై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలను బ్యాంకు శాఖల్లో లేదా అధికారిక యాప్‌ల ద్వారా మాత్రమే అప్‌డేట్ చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని బ్యాంకు శాఖల్లో అవగాహన పోస్టర్లు ప్రదర్శించి ఖాతాదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.





## కరెంటు షాక్‌తో ఎద్దు మృతి

**కుభీర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

అరకతోలే ఎద్దు కరెంటు షాక్ తగిలి మృతి చెందడంతో రైతుకు విషాదాన్ని మిగిల్చింది. మండలంలోని మాలేగాశీ గ్రామంలో రైతు భూషణ్ పశువుల పాకలో తన ఎద్దును కట్టేశాడు. రాత్రికి ఎద్దు తాడు తెంపుకొని మేతకోసం వెళ్ళి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌కు గురై మృతిచెంది ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఎద్దు విలువ రూ.90వేలు ఉంటుంది. అధికారులు నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

# విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు అందజేత

**దండేపల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మండలంలోని తాల్లపేట గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు గౌరిశెట్టి శ్రీనివాస్ 45వ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం తాల్లపేట జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విధ్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో బాగా చదవాలని కష్టపడి ఇష్టంతో చదువుతే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. అనంతరం విద్యార్థుల కు ప్యాడ్లు పెన్నులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు కటుకం శ్రీనివాస్, మల్యాల రమణయ్య, మల్యాల శ్రీనివాస్, కటుకం రాజేందర్, శ్రీనివాస్, కిష్టయ్య, అక్కినపెల్లి రమేష్, గునిశెట్టి చంద్రశేఖర్, శివ, యెలుగూరి వెంకటేష్, అనిల్, రవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మూడవ విడత రాండమైజేషన్ పూర్తి

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది కేటాయింపుకు సంబంధించిన మూడవ విడత రాండమైజేషన్ ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్‌తో కలిసి నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా. పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రాజు, నోడల్ అధికారి ఫణిందర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



# ఎన్నికల నిబంధనలు పాటించాలి

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- గుమిగుడడం, గుంపులు గుంపులుగా తిరగొద్దు
- సెల్ ఫోన్లు, వాటర్ బాటిల్స్, ఇంకు బాటిల్స్, పోలింగ్ కేంద్రాన్నిలోనికి అనుమతి లేదు..
- రెచ్చగొట్టే మాటలు, సోషల్ మీడియాలగొడవలకు దారి తీసేలా పోస్టులు పెడితే కటిన చర్యలు..
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను పరిశీలించిన ఎస్పీ





**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పట్టణంలో జరిగే ప్రతి ఒక్క వార్డులో పోలీసులు సూచించిన నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి సిబ్బంది పలుసూచనలు చేశారు. మున్సిపాలిటీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడదొద్దన్నారు. పోలింగ్ కేంద్రాలలోనికి సెల్‌ఫోన్‌లు, వాటర్ బాటిల్‌లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాలలోనికి అనుమతి ఇస్తారని తెలిపారు. తమ వెంట ఓటర్ ఐడి కార్డులను, గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలన్నారు. వాట్సాప్, సోషల్ మీడియాలో ఇతరులను రెచ్చగొట్టేలా, కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్‌లలో సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే విధంగా పలువురిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిని సైతం అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలో సోమవారం సాయంత్రం 5 గంటల నుండి సైలెన్స్ పీరియడ్ ప్రారంభమైందని, బయట వ్యక్తులు పట్టణంలో ఉండవద్దన్నారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడకూడదన్నారు. అనుమతులు లేనిదే ర్యాలీలు నిర్వహించడం, ర్యాలీలలో టపాకాయలు కాల్చడం చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహి స్తూ ప్రజలలో పోలీసుల పట్ల ధైర్యం నమ్మకం పెంపొందిం చేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్ర శాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలతో విధులను నిర్వర్తిస్తుందన్నారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని సంప్రదించవచ్చు అదే విధంగా డబ్బు, మద్యం, బహుమతులు లాంటివి పంచే క్రమంలో పోలీసులకు సమాచారం అందించాలి, పోలీసులు వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్ర మంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, మావల సీఐ కర్రె స్వామి, నూతన మున్సిప ల్ కమిషనర్ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



**ముథోల్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని సర్పంచ్ లావణ్య అన్నారు. సోమవారం ముథోల్ మండలంలోని ఆష్ట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొమ్మిది అంశాలపై చర్చించారు. వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి ప్రజలకు నీటి సరఫరా చేయాలని చర్చించారు. స్థానిక వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలనిఅన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందని, యువతకు జూదం వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు పలు అంశాలను సర్పంచుతో కలిసి పాలకవర్గం సభ్యులు చర్చించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సావిత్రి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్లబండిని ఢీకొన్న బైక్ వ్యక్తి మృతి

**వాంకిడి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
ఎడ్లబండిని బైక్ ఢీకొని బెండార గ్రామానికి చెందిన నాగోషే పెంటు మృతి చెందాడు. సోమవారం రాత్రి వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో బెండార గ్రామ శివారులో బైక్ అతివేగంగా వచ్చి ఎడ్లబండిని ఢీకొనడంతో పెంటు అక్కడిక్కడే మరణించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నర్సరీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



**వాంకిడి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మండలంలోని బంబార గ్రామపంచాయతీలోని నర్సరీలో చేపడుతున్న పనులను ఎంపీడీవో జ్యోత్స్న సోమవారం పరిశీలించారు. అలాగే గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దిశా పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న వంటశాల పనులను కూడా ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో ఆరు వేలకుపైగా మొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరితగతిన బ్యాక్‌ఫిల్లింగ్ పూర్తి చేసి విత్తనాలు వేయాలన్నారు. మొక్కల ఎదుగుదలకు అవసరమైన జీవామృతాన్ని తయారు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణాజీ, పంచాయతీ కార్యదర్శి ధర్మయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ చారి, నర్సరీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



### ఓట్ల లెక్కింపు సిబ్బంది విధులపై

## అవగాహన కలిగి ఉండాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తమ బాధ్యతలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనబోయే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియలో ప్రతి ఓటు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎటువంటి సందేహాలు వచ్చినా పై అధికారులను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సంబంధిత ఫారములను పకడ్బందీగా పూరించి, మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఈవో భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బాధితులకు ఎల్లవేళలా అండగా ఉండాలి

- ప్రజా అర్జీలపై అధికారులు వెంటనే స్పందించాలి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
ప్రతి సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజల సమస్యలపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది. ఇందులో భాగంగానే సోమవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి 13 మంది అర్జీలు సమర్పించారు. నేరుగా జిల్లా ఎస్పీకి తమ సమస్యలను విన్నవించుకు న్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ఎస్పీని కలిసిన ఫిర్యాదుదారులలో కుటుంబ సమస్యలు, భూతగాదాలు, పలు కేసుల పురోగతిపై సమస్యలు, భార్యాభర్తల సమస్యలు ఉన్నాయి. అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, కేసులను నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలపై, తమ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ గారికి 8712659973 నెంబర్ ద్వారా వాట్సాప్ మెసేజ్ రూపంలో సంప్రదించవచ్చును. ఈ ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయవద్దు
- పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉంది
- సమస్యలుంటే డయల్ 100కు తెలియజేయండి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలో ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా మరియు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ప్రజలు, రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు అందరూ ఎన్నికల నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీస్ అధికారులు సూచించారు. ఎన్నికలలో ఓటుకు మద్యం, నగదు, బహుమతులు ఇవ్వడం లేదా స్వీకరించడం చట్ట విరుద్ధమన్నారు. సోషల్ మీడియా వేదికలలో తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే పోస్టులు, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయరాదన్నారు. పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉండగా గుమికూడడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు చేయరాదన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 100 మీటర్లు-200 మీటర్ల పరిధిలో ఎన్నికల కమిషన్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. విజయోత్సవ ర్యాలీలో నిర్వహించడానికి అనుమతులు లేవని ఎస్పీ పేర్కొన్నారు. ర్యాలీలలో టపాకాయలు, డీజేలకు అనుమతులు లేవన్నారు. అదే విధంగా అక్రమ మద్యం, నగదు, బహుమతుల పంపిణీపై ప్రత్యేక నిఘా బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ ఎన్నికల కోడ్ అమలుపై పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. రాంనగర్, బొక్కలగుడ, అబ్దుల్లా చౌక్ ప్రాంతాలలో ప్రజలకు ఎన్నికల నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఎక్కడైనా అక్రమ నగదు, మద్యం, బహుమతుల పంపిణీ లేదా ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన సమాచారం తెలిస్తే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

**జన్నారం, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

రాబోయే వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మా, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ సంగీత తెలిపారు. సోమవారం మండలంలోని పొన్కల్ తిమ్మాపూర్ పంచాయతీ కార్యాలయంలో వేర్వేరుగా నిర్వహించిన గ్రామసభలో వారు మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఒక్కరూ సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలుటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

**నీటి సమస్యను పరిష్కరించాలని వినతి..**

గ్రామంలోని వివిధ వార్డులలో ఏర్పడిన నీటి సమస్యను పరిష్కరించాలని పలు కాలనీల ప్రజలు కోరారు. సభలో ప్రజలు పలు సమస్యలను ప్రస్తావించారు. చాలా కాలనీలలో నీరు రావడంలేదని, మిషన్ భగీరథ పైప్ లైన్‌లకు లీకేజీలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జలపతి, ఈవో రాహుల్ తిమ్మాపూర్ కార్యదర్శి లావణ్య వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థినిలు డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

గిరిజన విద్యార్థినులు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్‌లో మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... 2026- 27 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో గిరిజన విద్యార్థినులు ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యలో భాగంగా డిగ్రీ ప్రవేశాల కొరకు సకాలంలో దరఖాస్తు చేసుకొని అడ్మిషన్లు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.శారద, వైస్ ప్రిన్సిపల్, ఐ.క్యు.ఎ.సి. సమన్వయకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ అందుకున్న కలమడుగు వాసి




**జన్నారం, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్ దంపతుల కుమారుడు బొంతల మధుకర్ ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లో పీహెచ్‌డి పూర్తి చేసుకొని, హైదరాబాద్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో టాటా కార్నెల్ ఇన్స్టిట్యూట్ ఫర్ అగ్రికల్చర్ యూఎస్ఏ కార్నెల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రభు ఎల్ పింగళి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యల చేతుల మీదుగా పీహెచ్‌డి పట్టా, గోల్డ్ మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.




## మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తాం

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల కలెక్టర్లతో కలిసి మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలలో ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఓటర్ గుర్తింపు పత్రాల పంపిణీ పూర్తయ్యిందని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించామని పేర్కొన్నారు. ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల కోసం పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరా రెడ్డి, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్, ఎక్సైజ్ అధికారి ఎం.ఏ. రజాక్, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్‌లో ఉత్సాహంగా సీఎం కప్ క్రీడాపోటీలు

**నిర్మల్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2025-26 క్రీడల్లో భాగంగా నిర్మల్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు చివరి రోజు వాసవి వరల్డ్ స్కూల్ సమీపంలోని క్రీడా మైదానంలో ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి దాదాపు 900 మంది క్రీడాకారులు, 120 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, పీఈటీ సంఘాల బాధ్యులు, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. కబడ్డీ, యోగా, టైక్వాండో, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, ఉషు, అర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, సేపక్ తాక్రా, మల్లఖంబ్, రెజ్లింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని జిల్లా క్రీడల అధికారి తెలిపారు.



### ఎన్నికల కౌంటింగ్

# ప్రక్రియ పక్కాగా ఉండాలి

■ 49 వార్డుల లెక్కింపు కోసం 49 టేబుళ్ల ఏర్పాటు ■ 3నుంచి 4రౌండ్లలో ఫలితాలు వెల్లడించేలా ప్రణాళిక
■ కౌంటింగ్ ప్రక్రియను వీడియో తీయాలి ■ సిబ్బంది సమయపాలన పాటించాలి
■ ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలి ■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ మున్సిపాలిటీ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్‌తో పాటు కౌంటింగ్ ప్రక్రియ కూడా అత్యంత కీలకమని, కౌంటింగ్ సిబ్బందికి ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ రోజున అభ్యర్థుల సమక్షంలో ప్రతి దశను వీడియో గ్రాఫీ చేస్తూ నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చిన పక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం డ్రా ద్వారా విజేతను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని 49 వార్డుల కౌంటింగ్ కోసం 49 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో వార్డులో సుమారు 3000కు పైగా ఓట్లు ఉండే అవకాశం ఉన్నందున, మూడు నుంచి నాలుగు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది ఫిబ్రవరి 12న జరిగే రెండో విడత శిక్షణకు, అలాగే 13న జరిగే కౌంటింగ్ రోజున నిర్ణీత సమయానికి హాజరు కావాలని, గుర్తింపు కా ర్డులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. ఎటువంటి పొరపా ట్లకు తావ్వివొద్దన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, నోడల్ అధికారులు మనోహర్, ఫణిందర్, మాస్ట ర్ ట్రైనర్ లక్ష్మణ్, శిక్షకులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



### వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుండి మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ విసి హాల్ నుండి పాల్గొన్న ఎన్నికల సాధారణ పరిశీలకులు హన్మంత్ నాయక్ మాట్లాడుతూ, జిల్లాలోని ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఓటర్ గుర్తింపు పత్రాల పంపిణీ పూర్తయ్యిందని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించామని పేర్కొన్నారు. ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మెప్మా పిడి రాజు పాల్గొన్నారు.







## యాప్ ద్వారానే యూరియా అందజేత

**జన్నారం, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్' ద్వారానే యూరియా పొందాలని పోన్కల్ క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య సూచించారు. జన్నారంలోని ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. పారదర్శకమైన పంపిణీ కోసమే ప్రభుత్వం ఈ విధానాన్ని తెచ్చిందన్నారు. యాప్లో బుకింగ్ చేసుకున్న తర్వాతే దుకాణాలకు రావాలని, అక్కడ డీలర్లకు బుకింగ్ ఐడీ చూపించి యూరియా తీసుకోవాలని ఆమె రైతులకు వివరించారు. యూరియా బస్తాల కోసం రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

## నౌకదళ సేవకుడికి ఘన సన్మానం

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రానికి చెందిన బొమ్మెడి లక్ష్మి- బొమ్మెడి సంజీవ్‌ల కుమారుడు రాకేష్ గత 15సంవత్సరాలుగా భారతనౌకదళంలో దేశ సేవ చేసి విరమణ పొందిన సందర్భంగా గ్రామస్థులు సోమవారం స్థానిక గ్రామ పంచాయతీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సముద్ర సరిహద్దులను కాపాడుతూ, నిరంతరం దేశ భద్రతకు కాపలాగా నిలుస్తున్న భారత నౌకాదళ వీర జవాన్లు వారి త్యాగం, ధైర్యం, కర్తవ్యనిష్ఠతో భారత గౌరవాన్ని కాపాడుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పరచ సాయన్న, ఉప సర్పంచ్ శారద, వార్డు సభ్యులు, నాయకులు దుబ్బుల చంద్ర శేఖర్, జల్కె పాండురంగ్, ప్రశాంత్, శివుడు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.





### అంగన్‌వాడీ కార్యకర్తలు

## సమయపాలన పాటించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని ఐసిడిఎస్ జైనూర్ ప్రాజెక్ట్ అధికారి సిడిపిఓ ఇందిర అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో తప్పనిసరి ఉండాలన్నారు. ప్రాజెక్టు అభివృద్ధి కోసం అందరు సహకరించాలని, సమయపాలన పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతినెల గ్రామపంచాయతీ కార్యదర్శులు, తాసిల్దార్ సంబంధిత అధికారులు వచ్చినప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు వారికి సహకరించాల న్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమ్మ, సోంబాయి, హజీరా, సృజన, శ్యామ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 11న ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఎన్నికల కోసం పోలీస్, ఇతర శాఖల సిబ్బంది కలిపి మొత్తం 712 మందిని విధుల్లో నియమించినట్లు పేర్కొన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి సోమవారం సాయంత్రం 5 గంటల నుండి సైలెంట్ పీరియడ్ అమల్లోకి వస్తుందని, ఈ సమయంలో ఎన్నికల సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం, లౌడ్‌స్పీకర్లు, ర్యాలీలు, బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. అదే విధంగా సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లాలో 163 బి.ఎన్.ఎస్.ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులు గుమికూడరాదన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలకు అనుమతి లేదని, సంబంధిత అధికారులు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే సంబరాలు నిర్వహించుకోవాలని సూచించారు. రెండు మున్సిపాలిటీ పరిధిలో 2 స్టాటిక్ సర్వైలెన్స్ టీములు, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులను ఇప్పటికే బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఆసిఫాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (బాలికలు), ఉర్దూ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పోలీస్ అధికారులతో చర్చించారు. కౌంటింగ్ రోజున కౌంటింగ్ కేంద్రం పరిసరాలు, కళాశాల ఆవరణలో అనవసరంగా ఎవరూ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ గజానంద్ పాల్గొన్నారు.

# మైనార్టీల ఓట్ల కోసమే హిందువులపై దాడులు

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మైనార్టీల ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడులు చేస్తున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆరోపించారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రాజస్థాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7వ తేదీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న అజారుద్దీన్ అనే వ్యక్తి బైక్ మీద వెళుతున్న పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శంకరయ్యను బండతో కొట్టారని, విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న భాజపా నాయకులు శివ గౌడ్, ప్రవీణ్ ఎందుకు కొట్టావని ప్రశ్నిస్తే మజాక్‌లో కొట్టానని హేళనగా మాట్లాడారని, కేసుపెట్టాలని దరఖాస్తు ఇస్తే హిందువుల మీద ఆరు సెక్షన్లతో నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారని తెలిపారు. అదే అజారుద్దీన్ మీద కేవలం ఒక సెక్షన్ కేసు పెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని హరీష్ బాబు ఆరోపించారు. మైనార్టీల ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారని, ఎమ్మెల్సీ దండే విఠల్‌కు దమ్ముంటే భాజపా కన్న ఒక్క సీటు అదనంగా సాధించాలని, ఈ అక్రమ కేసులు బనాయించి కోనప్ప బాటలో నడవద్దని హితవు పలికారు. సాక్షాత్తు కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ మైనారిటీల సంతుష్టీకరణకు పాల్పడుతుతూ, కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. అక్రమ కేసులకు తాము ఎన్నడూ భయపడలేదని తన మనోబలం రెట్టించిందని, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ బల్దియాపై కాషాయ జెండా ఎగరవేస్తామన్నారు. ప్రజలు ఇటువంటి విభజన రాజకీయాలను ఛీదరించుకుంటున్నారని, కర్రు కాల్చి వాత పెడతారన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బీజేపీ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాల్సిన అవసరముందన్నారు. పట్టణ ప్రజలు బీజేపీ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.



## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

**వాంకిడి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని చౌపన్‌గూడ గ్రామ సర్పంచ్ డి. జైనుబాయి సూచించారు. సోమవారం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ఉపాధి హామీ పనులను పాలకవర్గ సభ్యులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేస్తోందని అన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీడం అన్నిగా, గ్రామ ఉపసర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## 20లోగా పత్తి విక్రయించాలి

**మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని రైతులు ఈ నెల 20వ తేదీలోగా తమ వద్ద ఉన్న పత్తిని విక్రయించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి మొహ్మద్ షాహబుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2025- 26 పత్తి సీజన్‌కు సంబంధించి కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో రైతులు తమ సమీపంలోని సిసిఐ కొనుగోలు కేంద్రాలలో ఈ నెల 20వ తేదీలోపు విక్రయించాలని తెలిపారు. ఈ మేరకు ముందస్తు సమాచారం అందించడం జరుగుతుందని, రైతులు ఈ విషయాన్ని గమనించి తమ వద్ద ఉన్న పత్తిని విక్రయించి లబ్ధి పొందాలని తెలిపారు.

## గ్రామాభివృద్ధికి అధికారులు సహకరించాలి

**లింగాపూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మండలంలోని లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ జాదవ్ రాజేశేఖర్ మాట్లాడారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఫారెస్ట్ సంబంధిత సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆయన తెలిపారు. గ్రామంలో బోరు వేయాలని కోరుతున్నప్పటికీ సంబంధిత అధికారులు అనుమతులు ఇవ్వడంలో ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామానికి రాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామసభకు వ్యవసాయ అధికారి హాజరు కాకపోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు ఏఈ అఖిల్, ఎఫ్‌బీఓ భగవంత్ రావు, ఆర్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.



## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**జైనూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండల కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను న్.ఈ.పీ. 2020 చట్టాన్ని రద్దుచేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, యి,సి,డి,స్ ను రక్షించాలని, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని,ఆశా వర్కర్లకు రూ.18,000/-ల ఫిక్సిడ్ వేతనం, ఇతర సమస్యలు పరిష్కరించే విధంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిధులు పెంచాలి. ఆశాలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ. 1500/-ల పారితోషికాలను వెంటనే అమలు చేయాలి. 2021 జూలై నుండి డిసెంబర్ వరకు 6 నెలల పి.ఆర్.సి. ఎరియర్స్ వెంటనే చెల్లించాలి. 2022 నుండి 2025 వరకు నాలుగు సంవత్సరాల లెప్రసీ సర్వే డబ్బులు, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులను క్రమబద్ధించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కారోబార్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. విద్యుత్ సవరణ, విబిజీ - రామ్జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, లైసెన్స్‌లో విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక ప్రమాదకర విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్ల పిలుపు మేరకు 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్, అన్ని రంగాల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



## 12న సమ్మెకు దూరంగా ఉండాలి

### మందమర్రి జీఎం రాధాకృష్ణ

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణిలో 12న కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెకు కార్మికులు దూరంగా ఉండాలని మందమర్రి జిఎం జీఎం రాధాకృష్ణ కోరారు. సోమవారం జి.ఎం కార్యాలయంలో ఒకరోజు సమ్మెకు సంబంధించి ఏరియా అధికారులతో సమీక్ష సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొన్ని కార్మిక సంఘాలు ఈ నెల 12 వ తేదీన తలపెట్టిన ఒక రోజు సమ్మెకు దూరంగా ఉండాలని అన్నారు. విధులకు హాజరై విధులకు హాజరై లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. కొన్ని జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు సంబంధించినవే కావని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం తీర్చగలిగినవి కూడా కావనీ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరిధిలోని సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం కలదనీ, సింగరేణి కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనవలసిన అవసరం ఉందా? ఆలోచించాలని కోరారు. వివిధ కారణాల వలన ఈ ఆర్థిక సంవత్సరం, నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి ఓవర్ బర్డెన్ తొలగింపులో కొంత వెనుకబడి ఉన్నామని, ఈ సమయంలో లక్ష్యసాధనకు ప్రతీ రోజు సాధించే ఉత్పత్తి కూడా ఎంతో తోడ్పాటునందిస్తుందనన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగడానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాధించి, రవాణా చేస్తూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ తెలిపారు. ఒక్కరోజు సమ్మె చేస్తే,కంపెనీకి కలిగే ఉత్పత్తి నష్టం విలువ రూ.77 కోట్ల వరకు ఉంటుందన్నారు. అలాగే కార్మికులు కోల్పోయే వేతనాలు సుమారు రూ.12 కోట్లు ఒక్క రోజు ఉత్పత్తి నష్టం-2.20 లక్షల టన్నులు ఉంటుందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం 2024-25 లో 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 65.27 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరిగినదన్నారు. లాభాల బోనస్, పిఎల్ఆర్ బోనస్లు ఉద్యోగులకు చెల్లించడం జరిగినదనీ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మనం సుమారు 49 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించామనీ, మిగిలిన 23 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్య సాధనకై ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన రెండు నెలలు ప్రతీ రోజు శ్రమించాల్సి ఉందనీ గుర్తు చేశారు. కనుక 12వ తేదీన తలపెట్టిన సమ్మెకు దూరంగా ఉండి, విధులు నిర్వహించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్ఓ టు జిఎంజిఎల్ ప్రసాద్,ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, ఏరియా ఇంజనీర్ జుడవీ బాలాజీ భగవతి, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎస్.కె గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, మందమర్రి ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీసీ కులాలను ఆదరించాలి



**జన్నారం, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

రాజకీయంగా కుమ్మరులను ప్రజాప్రతినిధులుగా గెలిపించాలని అన్ని కులాల ప్రజలకు కుమ్మర సంఘం మాజీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోడూరు చంద్రయ్య అన్నారు కులాల మధ్య ఐక్యత ఏర్పడాలని రాజకీయంగా అన్ని కులాలు ఎదగాలని సమ సమాజ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించాలని కుమ్మర కులస్తులు కూడా బీ సి కులాల అభ్యర్థులకే ఓట్లు వేయాలని అయన అన్నారు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన తెలంగాణ రాష్ట్రంలోని అనేక కులాల విద్యావంతులారా ప్రజలారా కుమ్మరి కులం నుండి ఈ 78 ఏళ్లుగా మన తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఎంపీగా ఎమ్మెల్సీగా ప్రత్యక్షంగా ఎన్నికలలో గెలిచిన సందర్భాలు లేవు. కుమ్మరి కులస్తులలో భారీగా డబ్బు సంపాదించి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే స్థితిలో లేనందున అసెంబ్లీ పార్లమెంట్లలో అడుగుపెట్టలేకపోతున్నారు. ఈ విధంగా కుమ్మర కులస్తులే కాకుండాఅనేక కులాల వారు ప్రజా ప్రతినిధులుగా గెలిచి అసెంబ్లీ పార్లమెంటులలో అడుగు పెట్టని కులాలవారిని అన్ని కులాలవారు ఆదరించాలని రాజకీయంగా అవకాశం కల్పించాలని రేపు జరగబోతున్న మున్సిపల్ మరియు కార్పొరేషన్ ఎన్నికలలో కౌన్సిలర్లుగా కార్పొరేటర్లుగా గెలిపించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్రం తరఫున అయన కోరారు సమ సమాజ నిర్మాణం జరగటానికి ఇది ఒక అవకాశంగా తీసుకోవాలని. కులాల మధ్య ఐక్యత ఏర్పడాలని అప్పుడే మన సమాజం బాగుపడుతుందని లేకుంటే కొన్ని కులాలవారే మనల్ని శాసించే అవకాశం వాళ్లకు ఇచ్చినట్లు అవుతుందని దయచేసి కుమ్మరి కులస్తులను కార్పోరేటర్లుగా కౌన్సిలర్లుగా గెలిపించాలని ఈ సందర్భంగా అన్ని కులాల వారిని కోరారు.

# కౌంటింగ్ కేంద్రంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత సూచించారు. సోమ వారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో, కాగజ్‌నగర్ లోని డీఏవీ పాఠశాలలో పంపిణీ కేంద్రాన్ని ఏ ర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రం, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం సిబ్బందికి, పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని తెలిపారు.

**ఓటు హక్కు వినియోగించుకోవాలి...**

మున్సిపల్ ఎన్నికల్లో అర్హత గల ప్రతి ఒక్కరు ఈ నెల 11న తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె హరిత తెలిపారు. ఎన్నికల జరుగుతు న్న ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, పరిశ్రమలు, ఇతర సంస్థలలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా యజ మాన్యాలు పోలింగ్ రోజున వేతనం తో కూడిన సెలవు ప్రకటించాలని తెలిపారు.



**ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి...**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్రఎన్నికల కమిషనర్ రాణికు ముదిని అన్నారు. సోమవారం

## కుమ్రంభీం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత

హైదరాబాద్‌లో ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నిక ల అధికారులు, కలెక్టర్‌లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్‌లు, పరిశీలకులు, మున్సిపల్ కమిషనర్లతో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

**3వ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి...**

మూడో ర్యాండమైజేషన్ ప్రక్రి యను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కె హరిత అన్నారు. కలెక్టరేట్ సముదాయ భవనం లోని వీసీ హాల్‌లో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 11న జరిగే ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎన్నికలవిధులు నిర్వహించే సి బ్బందిని మూడో ర్యాండమై జేషన్ ప్రక్రియ కా ర్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరిత మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అలోక్‌కుమార్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు.



## గ్రామ సభకు గైర్హాజరైన సర్పంచ్

**జన్నారం, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలం కామన్‌పల్లి గ్రామపంచాయతీ గ్రామ సభను సోమవారం నిర్వహించడానికి నిర్ణయిం చి పంచాయతీ సెక్రటరీ మరియు సర్పంచ్ ఉప సర్పం చ్ వార్డు సభ్యులు సంతకాలు చేయగా నిర్ణయించిన సమయానికి ఉదయం గ్రామసభ కి వచ్చిన గ్రామ ప్రజలు. సమయానికి సర్పంచ్ రాకపోవడంతో గ్రామ పంచాయతీ సెక్రెటరీ కరుణ సర్పంచ్ కి చరవానిలో సమాచారం ఇవ్వగా వస్తున్నానని చెప్పి ప్రజలందరినీ తప్పుతోవ పట్టించిన కామన్‌పల్లి సర్పంచ్ పద్ధతి సరైనది కాదని గ్రామ ప్రజలు వాపోయారు.

## ఆదిలాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

### మావల సీఐ కర్రె స్వామి

**మావల, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీసీ కేంద్రంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ ఉన్నం దున పట్టణంలోని ఐలవ్ ఆదిలాబాద్ నుండి మావల పోలీస్ స్టేషన్ వరకు ఉన్న రోడ్డుపై ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. ఫిబ్రవరి 10న ఎన్నికలలో డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ రోజున ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు, ఫిబ్రవరి 11 న పోలింగ్ పూర్తయిన తర్వాత సాయంత్రం 6 నుంచి ఉదయం వరకు, ఫిబ్రవరి 13 న కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం ఉన్నందున ఉదయం 8 నుంచి సాయంత్రం ప్రక్రియ పూర్తి అయ్యే వరకు సామాన్య ప్రజలకు అనుమతులు లేవని, ప్రజలందరూ పట్ట ణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు. కెఆర్‌కె కాలనీవాసులు తిరుమల పెట్రోల్ బంక్ మీదుగా వెళ్లలాని సూచించారు. హ్యాండీక్యాప్ కాలనీ, ఆర్‌ఆర్‌నగర్ వాసులు సరస్వతీ నగర్, సేవాదాస్ స్కూల్ మీదుగా వెళ్లాలన్నారు. పోలీసు సూచించినటువంటి నియమాలను పాటించి ప్రజలు సహకరించాలని తెలిపారు.

## రంజాన్ మాసంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

**జైనూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలం జంగం గ్రామం రంజాన్ మాసంలో మౌలి క సౌకర్యాలు కల్పించాలని సోమవారం మసీదు సదర్ సయ్య ద్ సలీంతో కలసి మైనార్టీ నాయకులు సర్పంచ్ పెందూర్ ఆసయ్య అర్జున్ ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్న సందర్భంగా మంచి నీ ళ్ళు సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అదేవిధంగా పొ ద్దున, సాయంత్రం విద్యుత్ సరఫరా ఆంతరయం కాకుండా సహకరించాలని కోరారు. మసీదు వద్ద పరిశుభ్రత, శానిటేషన్ పనులు చేపట్టాలని అన్నారు. సర్పంచ్ ఉప సర్పంచ్ సానుకూ



లంగా స్పందించి చరవాణితో అధికారులకు సమాచారం అం దించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## మాదిగలపై కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు

### ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పార్టీలకు ఇకపై బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఓటు కూడా వేయొద్దని మాదిగ ఉప కులాలకు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవ్ రావ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం అఖిల భారత మాలి సంక్షేమ సంఘం భవనంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల తో కలిసి ఆయన మాట్లాడారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 20 కౌన్సిలర్ స్థానాలు ఉండగా, కాంగ్రెస్ పార్టీ ఒక్క మాదిగకూ అవకాశం ఇవ్వకపోవడం సిగ్గుచేటని ఎస్సీ రిజర్వ్ స్థానాల్లో కూడా మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం అన్యాయమన్నారు. మాదిగవాడల్లోకి వెళ్లి ఏ ముఖం పెట్టు కొని ఓట్లు అడుగుతారని కాంగ్రెస్ నాయకులు సమాధానం




చెప్పాలని డిమాండ్ చేశారు, ఈ సమావేశంలో చంద్రగిరి సుదర్శన్, పొన్నాల నారాయణ, చంద్రగిరి రవి, పోల్కార్ రామచందర్, సురేష్, కే.రాజు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

**మందమర్రి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మందమర్రి పోలీసులు సోమవారం మధ్యాహ్నం అంగడి బజార్, శివాలయం రోడ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి, గంజాయి విక్రయిస్తున్న మహమ్మద్ సమీరుద్దీన్ అలియాస్ సమీర్ (21) అనే యువకుడిని అరెస్ట్ చేశారు. అతని నుంచి 165 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి, నిందితుడిపై కేసు నమోదు చేశారు.



## 108 అంబులెన్స్‌లో ప్రసవం

**జైనూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

సిర్పూర్(యు) మండలం శెట్టిహడాపనూర్ గ్రామ పంచాయతీ శెట్టిహడాపనూర్ గ్రామానికి చెందిన గర్భ వతి వెడ్మ నిర్మల(26)కి పురిటి నొప్పులు రావడంతో ఆశ వర్కర్ వెడ్మ రానుబాయి తక్షణమే 108 అంబులె న్సుకు కాల్ చేశారు 108 సిబ్బంది తక్షణమే స్పందిం చి హాస్పిటల్ వెళ్ళేక్రమంలో నొప్పులు అధికంగా కావ డంతో అత్యవసర సమయంలో మార్గమధ్యలో 108 అంబులెన్సులోనే ప్రసవించింది. పండంటి అడా బిడ్డకు జన్మనిచ్చినట్టు 108 ఈఎంటి ప్రశాంతకుమార్ పైలట్ రవి నాలాగంటి తిలిపారు. అనంతరం సిర్పూర్ యూ ఆసుపత్రికి తరాలంచినట్టు ఆశ వర్కార్ మీ 108 సేవ లు ఎప్పటికి మరువబొమని తల్లిబిడ్డ క్షేమమే తెలిపారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్‌హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీతకృత కలెక్టరేట్ భనవ సముదాయంలో గల కలె క్టర్ చాంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారం కార్యక్రమా నికి సంబంధిత గోడ ప్రతులను బ్యాంకు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 13 వరకు దేశ వ్యాప్తం గా నిర్వహి స్తున్న ఆర్థిక అక్షరాస్యత వారం కార్యక్రమం లో భాగంగా జిల్లాలో కార్యక్రమాలు నిర్వహించి ప్రజల కు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకులు తమ వెబ్‌సైట్లు, ఏటీఎం స్క్రీన్‌లు, శాఖలలో పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని రాజంపేటలోని శ్రీ లక్ష్మీ హోటల్లో అనుమ తులు లేకుండా మద్యం విక్రయిస్తున్న గోగికార్ రంజిత్ ను పోలీసులు అరెస్టు చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముందుగానే మద్యం నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఎస్ఐ ఉదయ్ కిరణ్ నేతృత్వంలో దాడి చేసి, వివిధ బ్రాండ్లకు చెందిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.87,720/గా అంచనా వేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రికి సన్మానం

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ లో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు హిందూ ధర్మ పరిరక్షణకై కృషి చేస్తున్న సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రిని మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. జనవరి 26న కలెక్టర్ చేతుల మీదుగా సామాజిక సేవా ప్రశంసా పత్రాన్ని అందుకున్న ప్రమోద్ కుమార్ ఖత్రిని సోమవారం శాలువాతో సత్కరించి అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సంఘం అధ్యక్షులు శంకర్ దాస్, రాజు, సంతోష్, వామన్, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.





# పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

## కుమ్రంభీం జిల్లా కలెక్టర్ హరిత

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పోస్టల్ బ్యాలెట్ నిర్వహణతో పాటు డిఏవి లక్ష్మీపత్ సింగానియా స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పార్కింగ్ ఏర్పాట్లను సోమవారం జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిత, సబ్ కలెక్టర్ డేవిడ్, మున్సిపల్ కమిషనర్ బి.తిరుపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమాదేవి, ఎమ్మార్వో మధుకర్, టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, బ్యారికేడింగ్, విద్యుత్ సరఫరా, తాగునీరు, ఇతర మౌలిక వసతుల పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి సూచించారు.




## ప్రభుత్వ పాఠశాల
# ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు

**రెబ్బెన, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
రెబ్బెన మండలంలోని గోలేటిలోని సింగరేణి క్రీడా మైదానంలో పీఆర్టీయూ టీఎస్ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 15 మండలాల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గోలేటి సింగరేణి ఇంచార్జి జనరల్ మేనేజర్ నరేందర్, రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ, గోలేటి సర్పంచ్ బాబూరావు, ఏటుకూరి శ్రీనివాసరావు సునార్కర్ అనిల్ కుమార్,మేకర్తి వెంకటేశ్వర్లు,తోట రమేష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జీఎం నరేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, అదేవిధంగా క్రికెట్ ఆట ద్వారా క్రీడాస్ఫూర్తితో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, ఉపాధ్యాయ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాబురావు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులను కలుసుకోవడం సంతోషంగా ఉందని, ఉపాధ్యాయులు నిరంతరం విద్యాభివృద్ధికి పాటుపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పల నరసింహాచారి, జాడి జ్ఞానేశ్వర్, పత్తిపాక శ్రావణ్ కుమార్, రాథోడ్ వినోద్ కుమార్, ఎల్లల శ్రీకాంత్, భత్తుల సదానందం, రేగళ్ళ వెంకటేశ్వర్లు, ఇందారపు ప్రకాష్, గుండు యాదగిరి, ఉప్రే వినేష్, కుమ్మరి రవి, గుండు యాదగిరి,వివిధ సంఘాల నాయకులు ముడి మడుగుల తిరుపతి, ఆదే శ్రవణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కరాటే పోటీలో విద్యార్థుల ప్రతిభ



**మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో మంచిర్యాల విద్యార్థులు పాల్గొని ప్రతిభనుచాటారు. కాసిపేట మండలం సోమగూడెంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్‌లో మంచిర్యాల పట్టణానికి చెందిన స్పోర్ట్స్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని పలు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. కాటాస్ విభాగంలో రోహిణి ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. శ్రీమణి కూడా కాటాస్ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. అండర్-14 విభాగంలో నేహ ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని అందుకుంది. బాలుర విభాగంలో స్పారింగ్ ఈవెంట్లో అయాన్, అద్వైత్, హరీష్, నైతిక్లు ప్రథమ స్థానాలు సాధించి బంగారు పతకాలను గెలుచుకున్నారు. విద్యార్థులకు శిక్షణనిచ్చినభారతి మాస్టర్ శివమహేష్ మాస్టర్ విజేతలను అభినందించారు. స్పోర్ట్స్ కరాటే క్లబ్ స్థాపకులు అట్టెం మధునయ్య విద్యార్థు క్రీడా స్ఫూర్తి పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఎన్నికలు.. చెన్నూరులో నగదు పట్టివేత



**చెన్నూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 15వ వార్డులో బరిలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి గుర్రం ఉమారాణి శ్రీనివాస్‌కు చెందిన లక్ష యాభై వేల రూపాయల నగదును టౌన్ సీఐ బన్సీలాల్ తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలోని ప్రతాప మారుతి ఆలయం వద్ద పట్టణానికి చెందిన వ్యాపారి పడమటింటి శ్రీనివాస్ వద్ద ఎటువంటి ఆధారాలు లేకుండా లక్ష యాభై వేల రూపాయల నగదుతో తారసపడగా, అతని వద్ద నుంచి లక్ష యాభై వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేపట్టిన పోలీసులకు, తన మిత్రుడు గుర్రం శ్రీనివాస్ బీఆర్ఎస్ తరపున బరిలో ఉన్న అభ్యర్థి భర్త అవసరం కోసం డబ్బులు తీసుకురమ్మని చెప్పడంతో వాటిని తీసుకెళ్తున్నట్లు అతడు తెలిపాడు. దీంతో డబ్బులను స్వాధీనం చేసుకుని ఎన్నికల ప్రత్యేక ఎఫ్ఎస్టీ బృందానికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు, వ్యాపారులు ఎలాంటి సరైన కారణాలు లేకుండా అధిక మొత్తంలో నగదు లావాదేవీలు చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.





## పదిలో వందశాతం
# ఫలితాల దిశగా తర్ఫీదు

**రెబ్బెన, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
గంగాపూర్‌లోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ బోధన కొనసాగుతోంది. ఉపాధ్యాయులు విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా, ఎక్కువ మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తూ వారిని పరిపూర్ణులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 42 మంది విద్యార్థులకు గాను 40 మంది ఉత్తీర్ణత సాధించి జిల్లా స్థాయిలో ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్న ఈ విద్యాలయం, ఈ సంవత్సరం 39 మంది విద్యార్థులకు గాను 39 మంది ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, మంచి మార్కులతో రాష్ట్ర స్థాయిలో కూడా స్థానం సంపాదించాలనే లక్ష్యంతో పట్టుదలగా ముందుకు సాగుతోంది. ఈ విషయాన్ని విద్యాలయ ప్రత్యేక అధికారి పద్మ తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా శ్రద్ధతో చదివేలా చూసి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి మంచి మార్కులు వచ్చే విధంగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా స్కోర్ చేసే ఇంగ్లీష్, గణితం, సైన్స్ వంటి సబ్జెక్టుల పై ప్రత్యేక దృష్టి సారిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనికి తోడు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సమయంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 సెప్టెంబర్‌లో జరిగిన జిలా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో ఈ విద్యాలయ ప్రత్యేక అధికారి పద్మ ఎంపికై, జిల్లా అధికారుల చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించడమే కాకుండా, వారికి అందిస్తున్న రుచికరమైన భోజనాన్ని ప్రశంసించారు. ఫలితాల పై ప్రత్యేక దృష్టి సారించి 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు సాగాలని ఉపాధ్యాయులను సూచించారు.

# చికిత్స పొందుతూ యువకుడు మృతి

**ముథోల్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లా బైంసా పట్టణానికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. బంధువులు, సన్నిహితులు పేర్కొన్న ప్రకారం.. వారం రోజుల క్రితం పట్టణనికి చెందిన ఆకాష్ (27)ఐబి చౌరస్తాలో గల డివైడర్‌కు ఢీకొనడంతో ప్రమాదం సంబంధించిదని, బలమైన గాయాలపాలైన ఆకాష్‌ని ఉన్నత వైద్యం నిమ్మిత్తం నిజామాబాద్‌కు తరలించగా, చికిత్స పొందు తూ.. సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

# పోటీ పరీక్షల అభ్యర్థులు పుస్తక పఠనంపై దృష్టి సారించాలి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రామాణిక పుస్తకాల పఠనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన ఫౌండేషన్ ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోటీ పరీక్షల్లో జనరల్ స్టడీస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రామాణిక పుస్తకాల అధ్యయనం అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లక్ష్యం సాధించే దిశగా ప్రతి అభ్యర్థి ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలని, కష్టసమయాల్లో నిరాశ చెందకుండా పట్టుదలతో చదవాలని హితవు పలికారు. క్రమశిక్షణతో



శ్రమిస్తే భవిష్యత్తులో ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యమవుతాయని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేసి, బీసీ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన పలువురిని శాలువాలతో కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగం, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఫ్యాకల్టీ రమేష్, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆవేశం 2’ లోడెడ్



2024లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న చిత్రం ‘ఆవేశం’. ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ సినిమా మలయాళంలో రూ.150 కోట్లు వసూలు చేసి రికార్డులు సృష్టించింది. ఈ చిత్రానికి సీక్వెల్ ఎప్పుడొస్తుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరైన ఫహద్ తన అప్‌కమింగ్ చిత్రాల గురించి మాట్లాడారు.ఒకే సమయంలో తెలుగు, తమిళం, మలయాళం సినిమాలు చేయగలుతున్నారంటే దానికి దర్శకులే కారణమన్నారు. మమ్ముట్టి, మోహన్‌లాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ‘పేట్రియాట్’లో తాను విలన్ పాత్రలో కనిపించనున్నట్లు ఫహద్ చెప్పారు. ప్రేక్షకులు చాలామంది ‘ఆవేశం 2’ కోసం ఎదురుచూస్తున్నారని.. ఆ సీక్వెల్ కచ్చితంగా ఉంటుందన్నారు. 2027, 2028లో దీన్ని విడుదల చేస్తామని తెలిపారు. జీతూ మాధవన్ దర్శకత్వంలో ‘ఆవేశం’ రూపొందింది. మలయాళంలో విడుదలై సంచలనం సృష్టించిన ఈ సినిమా ఓటీటీలోనూ రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం జీతూ.. సూర్య హీరోగా ఓ సినిమా చేస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత ఫహద్ ఫాజిల్ ప్రాజెక్ట్ పట్టాలెక్కనున్నట్లు తెలుస్తోంది.



# సంక్రాంతికి సోగ్గాళ్లు

ఈ ఏడాది సంక్రాంతికి ఐదు సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. బాక్సాఫీస్ దగ్గర వచ్చే ఏడాది కూడా అదే స్థాయిలో సందడి ఉండబోతోందా? అంటే - అంతకంటే ఎక్కువే అంటున్నాయి తెలుగు సినీ పరిశ్రమ వర్గాలు. తెలుగు చిత్రసీమకి నాలుగు మూలస్తంభాల్లాంటి కథానాయకులైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున సినిమాలు వచ్చే సంక్రాంతినే లక్ష్యంగా చేసుకుని పట్టాలెక్కుతున్నాయి. చిరంజీవి - బాబీ కొల్లి, బాలకృష్ణ - గోపీచంద్ మలినేని, వెంకటేశ్ - అనిల్ రావిపూడి సినిమాలు ఇప్పటికే ఖరారు కాగా, ‘వాసివాడి తస్సాదియ్యా...’ అంటూ నాగార్జున సినిమాని ప్రకటించింది అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ. సోగ్గాళ్లు మళ్లీ వస్తున్నారని, పండగ ఇంకా కలర్‌ఫుల్‌గా మారుతుందని ఊరిస్తూ... ఆ చిత్రం 2027 జనవరి 15న ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించింది. ‘సోగ్గాడే చిన్నినాయనా’, ‘బంగార్రాజు’ చిత్రాల్ని తెరకెక్కించిన దర్శకుడు కల్యాణ్‌కృష్ణ కురసాల కొంతకాలంగా నాగార్జున కోసం ఓ కథని సిద్ధం చేస్తున్నారు. అది ‘సోగ్గాడే...’కి కొనసాగింపు అని సమాచారం. అందులో తండ్రీకొడుకులు కలిసి సందడి చేస్తారని తెలుస్తోంది. నాగార్జునతోపాటు నాగచైతన్య, అఖిల్ కూడా సినిమాలో కనిపిస్తారేమో చూడాలి.



# సంయుక్త జోరు..

ప్రముఖ హీరోయిన్ సంయుక్త గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అమాయకంగా కనిపిస్తూనే.. తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తొలిసారి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రానా కాంబినేషన్లో వచ్చిన ‘భీమ్లా నాయక్’ సినిమాలో రానా భార్య పాత్రలో నటించి ఆకట్టుకుంది. క్లైమాక్స్‌లో సన్నివేశాలు ప్రేక్షకుల చేత కంటతడి కూడా తెప్పిస్తాయి. అలా తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న సంయుక్త మీనన్.. 2016లోనే ‘పాప్ కార్న్’ అనే మళయాల చిత్రం ద్వారా హీరోయిన్గా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఇక ఒక్కో భాషా చిత్రంలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తూ వచ్చిన ఈమె తెలుగు, తమిళ్ , కన్నడ, మలయాళం భాషల్లో నటిస్తూ మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది.ఒకవైపు సినిమాలు చేస్తూనే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటోంది సంయుక్త మీనన్. ఈ మధ్యకాలంలో రోజుకొక గ్లామర్ ఫోటో షూట్ తో అభిమానులను ఆకట్టుకుంటుంది. అందులో భాగంగానే తాజాగా ట్రాన్స్పరెంట్ దుస్తులు ధరించి తన అందాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అందులో కొంటెగా ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరుకి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. అంతేకాదు ఈమె ఈ ఫోటోలను షేర్ చేస్తూ.."కొంచెం సాఫ్ట్.. కొంచెం హాట్" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం సంయుక్త మీనన్ షేర్ చేసిన ఈ ఫోటోలకు అటు నెటిజన్స్ కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. 2022లో కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన బింబిసారా సినిమాలో హీరోయిన్గా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. 2023లో తెలుగు, తమిళ్ బైలింగ్వల్ గా వచ్చిన సార్ సినిమాలో టీచర్ క్యారెక్టర్ లో మరింతగా ఆకట్టుకుంది. ఇక తెలుగు, తమిళ్ అని తేడా లేకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వచ్చిన ఈమె గత ఏడాది చివర్లో నటసింహ నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన అఖండ 2లో నటించి ఆకట్టుకున్న ఈమె.. ఈ ఏడాది శర్వానంద్ సరసన ‘నారీ నారీ నడుమ మురారి’ సినిమాలో హీరోయిన్గా నటించింది.

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న మునిసిపల్ ఎన్నికల్లో ప్రచార ఘట్టం ముగిసి, కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్ పర్వం మొదలైంది. అధికార, ప్రతిపక్షాల నడుమ హోరాహోరీగా ఎన్నిక జరుగుతుండడంతో ప్రతీ ఓటును రాబట్టేందుకు పార్టీలు, అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఓటర్లను తమవైపునకు తిప్పుకునేందుకు తాయిలాల పంపిణీ ప్రారంభించారు. బలమైన పోటీ ఉన్నచోట ఒకతీరు, నామమాత్రపు పోటీ ఉన్నచోట్ల మరోతీరుగా నగదు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారికంగా ప్రచారం సోమవారం సాయంత్రానికే ముగిసినప్పటికీ వార్డుల్లో విచ్చలవిడిగా మద్యం, నగదు, మాంసం, తాయిలాల పంపకాలు సాగుతున్నాయి. పోలింగ్‌కు గడువు సమీపిస్తుండడంతో గెలుపునకు ఎంతదూరంలో ఉన్నామో అంచనా వేసుకుంటున్న ప్రధాన పార్టీల నేతలు ఆయా వార్డుల్లో అభ్యర్థుల గెలుపుకు అవసరమైన ఓట్లను సమీకరించేందుకు తుది ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆయా వార్డుల్లో ఎక్కువ ఓట్లున్న కుటుంబాల పెద్దలను నేరుగా కలిసి ఓట్లేస్తే ఏం కావాలో అది చేస్తామని హామీ పత్రాలివ్వడమేగాక, నగదు ఎంతడిగితే అంత ఇస్తూ మాట తీసుకుంటున్నారు. మరోవైపు ప్రత్యర్థి పార్టీలో, బరిలో ఉన్న మూడు, నాలుగు స్థానాల్లో నిలుస్తారని భావిస్తున్న అభ్యర్థుల తరపున బలంగా పనిచేస్తున్న కార్యకర్తలు, వారికి అండగా ఉండే ఓటర్లను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నాలు, చర్చలు ప్రారంభించారు.

## మూగబోయిన మైకులు

# నోటికి తాళం.. ఓటుకు బేరం





- ముగిసిన మునిసిపల్ ప్రచారం
- ఫుల్‌గా తాగండి.. ఊగండి.. ఓటు మాకే వేయండి
- గంపగుత్తగా ఓట్ల కొనుగోళ్లకు వ్యూహాలు
- మొదలైన తాయిలాల పంపిణీ
- ఓటుకు రూ.1,500 నుంచి రూ.6వేల వరకు
- మద్యం పంపిణీకి సిద్ధం
- వార్డుల్లో పార్టీలు
- కానుకలిచ్చి.. కాళ్లు మొక్కుతున్న వైనం
- ఎన్నికలను సవాల్‌గా తీసుకున్న పార్టీలు
- మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి కింది స్థాయి నాయకుల వరకు అంతా ప్రచారంలోనే
- గెలుపు ఓటములపై ఎవరి అంచనాలు వారివే
- రేపు పోలింగ్, 13న కౌంటింగ్

నోటికి తాళం వేశారు.. ఓటుకు నోట్ల బేరం మొదలైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం 48 గంటల ముందు సోమవారం సాయంత్రం 5 గంటలకు ముగిసిపోయింది. గప్‌చుప్‌గా ఓటర్లను ఆకట్టుకోవడానికి చివరి ప్రయత్నంగా ఓట్లకు నోట్లు, నజరానాలతో ప్రలోభాలకు తెరలేపారు. మంగళవారం రాత్రి కీలకంగా భావిస్తూ అభ్యర్థులు అందుకు సిద్ధమయ్యారు. తెల్లవారితే బుధవారం పోలింగ్ ఉండ దంతో అభ్యర్థులు ఖర్చులకు వెనకాడడం లేదు. ఇప్పటికే రెండు మున్సిపాలిటీలో రూ. 20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చుకు సిద్ధమై ఎన్నికల బరిలో నిలిచారు. గడిచిన ఐదు రోజుల్లో అభ్యర్థులు రూ.20 లక్షల పైన ఖర్చు చేశారు. చివరి రెండు రోజులు మరో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఓటర్లకు పంపిణీ చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. చివరి ప్రయత్నంగా మద్యం, డబ్బులతో పాటు గిఫ్టులు ఇస్తున్నారు. ఓటర్లు మాత్రం ఏ అభ్యర్థిని చిన్న బుచ్చకుండా అందరి నజరానాలు స్వీకరిస్తున్నారు. మీకే ఓటు అంటూ దీవించి పంపిస్తున్నారు చివరికి ఎవరికి ఓట్లు వేస్తారనేది సందిగ్ధంగా మారింది. ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న మునిసిపల్ ఎన్నికల్లో ప్రచార ఘట్టం ముగిసి, కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్ పర్వం మొదలైంది. అధికార, ప్రతిపక్షాల నడుమ హోరాహోరీగా ఎన్నిక జరుగుతుండడంతో ప్రతీ ఓటును రాబట్టేందుకు పార్టీలు, అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఓటర్లను తమవైపునకు తిప్పుకునేందుకు తాయిలాల పంపిణీ ప్రారంభించారు. బలమైన పోటీ ఉన్నచోట ఒకతీరు, నామమాత్రపు పోటీ ఉన్నచోట్ల మరోతీరుగా నగదు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారికంగా ప్రచారం సోమవారం సాయంత్రానికే ముగిసినప్పటికీ వార్డుల్లో విచ్చలవిడిగా మద్యం, నగదు, మాంసం, తాయిలాల పంపకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పోలింగ్‌కు గడువు సమీపిస్తుండడంతో గెలుపునకు ఎంతదూరంలో ఉన్నామో అంచనా వేసుకుంటున్న ప్రధాన పార్టీల నేతలు ఆయా వార్డుల్లో అభ్యర్థుల గెలుపుకు అవసరమైన ఓట్లను సమీకరించేందుకు తుది ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆయా వార్డుల్లో ఎక్కువ ఓట్లున్న కుటుంబాల పెద్దలను నేరుగా కలిసి ఓట్లేస్తే ఏం కావాలో అది చేస్తామని హామీ పత్రాలివ్వడమేగాక, నగదు ఎంతడిగితే అంత ఇస్తూ మాట తీసుకుంటున్నారు. మరోవైపు ప్రత్యర్థి పార్టీలో, బరిలో ఉన్న మూడు, నాలుగు స్థానాల్లో నిలుస్తారని భావిస్తున్న అభ్యర్థుల తరపున బలంగా పనిచేస్తున్న కార్యకర్తలు,వారికి అండగా ఉండే ఓటర్లను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నాలు, చర్చలు ప్రారంభించారు. ఓటర్లకు ఇచ్చే తాయిలాలు యథావిధిగా ఇస్తూ, వారిని తమవైపునకు తిప్పి ఓట్లేయిస్తే సదరు ఛోటా లీడర్లకు రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు నగదు, కార్లు బహుమానాలుగా ఇస్తామని హామీలు ఇస్తున్నట్లు తెలిసింది. కొన్ని చోట్ల ఇళ్లస్థలాలను ఛోటా లీడర్లకు ఎరవేసినట్టు చెబుతున్నారు. గతానికి భిన్నంగా హోరాహోరీ పోరు నెలకొన్న నేపథ్యంలో కీలకమైన మునిసిపాలిటీల్లో వీరికి డిమాండ్ పెరిగినట్లు చెబుతున్నారు. మునిసిపల్ ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. ఇన్ని రోజులు వివిధ పార్టీల అభ్యర్థుల తరుపున రకరకాల పాటలు, మాటలతో హోరెత్తించిన మైకులు ఒక్కసారిగా మూగబోయాయి. నిబంధనల మేరకు ఎన్నికలకు రెం డు రోజులు ముందుగానే అభ్యర్థులంతా తమ ప్రచారం ముగించాల్సి ఉంది. దాదాపు పది రోజుల పాటు అభ్య ర్థులు, కుటుంబ సభ్యులు, వారి మద్దతుదారులు అలు పెరగకుండా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 11న ఎన్నికలు జరుగనుండగా, 13న ఓట్ల లెక్కింపుతో విజేతలు ఎవరో తేలనుంది. ఎన్నికల్లో తమకు లబ్ది చేకూర్చేలా అన్ని అస్త్రాలను వినియోగించనున్నారు. ఇందులో భాగంగా ఓటర్లను మచ్చిక చేసేందుకు రంగం సిద్ధ మైంది. చోటా మోటా నాయకులతో కలిసి వార్డుల్లో ఓటర్లకు పెద్ద మొత్తంలో దావత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ పార్టీల అభ్యర్థులు ఇచ్చే విందులో ఓటర్లు మునిగి తేలుతున్నారు. ఎన్నికల ప్రత్యక్ష ప్రచారం ముగియడం, మరో రెండు రోజుల గడువు ఉండటంతో అభ్యర్థుల మధ్య ఇక 'సోషల్ వార్' ఊపందుకోనుంది. ఇందుకు వేదకగా సామాజిక మాద్యమాలను వినియోగిస్తూ విస్త్రత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఒకరికి మించి మరొకరు పోస్టులు పెడుతూ ప్రజల ఆలోచనా ధోరణిని మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల్లో విస్తృత ప్రచారం కోసం బరిలో ఉన్న అన్ని పార్టీల అభ్యర్థులు అధికంగా సామాజిక మాద్యమాలపై ఆధారపడుతున్నారు. ఇందు కోసం చురుకుగా ఉండే యువకులతో ప్రత్యేకంగా టీంలను నియమించుకుం టు న్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ ప్రచారం కోసం ఈ కొత్త పంథాను ఎంచుకున్నాయి. ఒక్కో పార్టీకి అనుబంధంగా పని చేసేందుకు కనీసం వంద మంది వరకు సోషల్ మీడియా వారియర్స్‌ను ఇప్పటికే నియమించుకున్నారు. మొత్తానికి పోలింగ్ గడువు సమీపిస్తున్న కోద్దీ మున్సిపాలిటీల్లో రాజకీయం మరింత వేడెక్కుతోంది.

## బెల్లంపల్లిలో వేడెక్కిన రాజకీయం

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ విజయం కోసం మిగిలిఉన్న చివరి అస్త్రాలపై దృష్టి సారించారు. ఎన్నికల ప్రచారం ముగిసిన పోలింగ్‌కు మరో 48 గంటల సమయం ఉండటంతో తమ విజయం కోసం వార్డుల్లో స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్ల ప్రసన్నం కోసం నానా తంటాలు పడుతున్నారు. బుధవారం వారం బెల్లంపల్లి మున్సిపల్‌లోని 34 స్థానాలకు పోలింగ్ జరగనుంది. అయితే ఈ సారి రికార్డ్ స్థాయిలో 66 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉండడంతో ప్రధాన పార్టీ లకు రెబెల్స్ బెండద తప్పడం లేదు.ఎలాగైనా మున్సిపల్‌లో జెండా ఎగరేయడానికి ప్రధాన పార్టీ ల నాయకులు వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు రెబెల్స్ ను బుజ్జగించేది ప్రయత్నం చేశారు. ప్రచార పర్వం ముగియడంతో విందు రాజకీయాలకు తెరతీశారు. ఎన్నికలను ప్రతిష్టత్మాకంగా తీసుకున్న పలువురు డబ్బు, మద్యం పంపిణికి రంగం సిద్ధం చేసుకున్నారు.




## మద్యానికి బానిసై ఆత్మహత్య

**కాసిపేట, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**



కాసిపేట మండలం దేవాపూర్ రాంపూర్‌కు చెందిన తోటపల్లి శంకర్ (50) తాగుడుకు బానిసై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపారు. శంకర్ గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసై పనికి వెళ్లకు కుటుంబ సభ్యులతో చనిపోతానని బెదిరించేవాడని తెలిపారు. వారం రోజులుగా విపరీతంగా మద్యం తాగుతుండడంతో మద్యం బంద్ చేయాలని కుటుంబ సభ్యులు మరోసారి కోరారు. దీంతో తీవ్రంగా మనస్తాపానికి గురై ఇంట్లోకి వెళ్లి దూలానికి చీరతో ఉరి వేసుకొని చనిపోయాడని వివరించారు. ఈ మేరకు భార్య తోటపల్లి దేవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ఎన్నికలకు ఐదంచెల భద్రత

- మంచిర్యాల జిల్లాలో 444 పోలింగ్ కేంద్రాలు
- 179 అత్యంత సమస్యాత్మకం కేంద్రాల గుర్తింపు
- మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్



**మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఐదంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో భదద్ర ఏర్పాట్లపై సోమవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మద్యం, డబ్బు, బహుమతుల పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయ కుండా అన్ని విధాల చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నెల 11న పోలింగ్ నిర్వహణకు భదద్ర ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో 444 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఇందులో 179 సమస్యాత్మకంగా గుర్తించామని, వీటిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తుంటాయన్నారు. 168 మంది పాత నేరస్తులను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని, అనుమతి లేకుండా నగదు తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. రూ.2.58లక్షలు నగదు సీజ్ చేశామని, రూ.2.20లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని 51 కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఆరు కేసులు నమోదు చేశామని, జిల్లాలోని గూడెం, అర్జునగుట్ట, ఇందనపల్లి, తాండూర్ వద్ద ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడితే కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన, డబ్బులు, మద్యం పంపిణీ, మతవిద్వేశాలను రెచ్చగొట్టేలా ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వెంటనే డయల్ 100, ఎన్నికల ఫిర్యాదుల విభాగం టోల్ ఫ్రీ నంబర్ 08736 250501లో సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు.

## హత్య కేసులో జీవితఖైదు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

హత్య కేసులో నిందితుడు మడావి అయ్యుకు జీవిత ఖైదుతో పాటు రూ.15వేల జరిమానా విధిస్తూ ఫ్యామిలీ కోర్టు, 3వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి లక్ష్మికుమారి సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. 2018లో తలమడుగు పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదైంది. అప్పటి సీఐ ప్రదీప్ విచారణ చేపట్టి చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు వివరించారు.

## గృహహింస కేసులో జైలు

**ఖానాపూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

గృహహింస కేసులో నిందితుడికి ఏడునెలల సాధారణ జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రిన్సిపల్అండ్ జిల్లా క్రైం సెషన్స్ జడ్జి శ్రీవాణి సోమవారం తీర్పు వెలువరించారు. మండలంలోని పాత ఎల్లాపూర్‌కు చెందిన ఆడెపు పుష్పలత ఫిర్యాదు మేరకు ఆమె భర్త వేణుగోపాల్‌పై 2012లో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 498(ఎ) ఐపీసీ, డౌరీ నిరోధక చట్టంలోని 3,4 సెక్షన్ల కింద కేసు నమోదైంది. విచారణ అనంతరం జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

## గంజాయి పట్టివేత

**మందమర్రి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగడిబజార్ ఏరియాలో గల శివాలయం రోడ్డులో మహమ్మద్ సమీరుద్దీన్ వద్ద సోమవారం 165 గ్రాముల గంజాయి పట్టుకున్నట్టు ఎస్సై నరేష్ తెలిపారు. పట్టుకున్న గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## కొడుకు మరణం తట్టుకోలేక తల్లి ఆత్మహత్య

**కెరమెరి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

కొడుకు మరణం తట్టుకోలేక మనోవేదనతో తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని తుమ్మగూడకు చెందిన చౌహాన్ అరవింద్ ఆరు నెలల క్రితం జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి తల్లి చౌహాన్ సుమత్రబాయి మనోవేదనకు గురైంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. పొలం పనులకు వెళ్లిన భర్త గోవింద్ మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా మంచంపై విగతజీవిగా పడిఉంది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్. సుధాకర్ తెలిపారు.

## కుల బహిష్కరణకు పాల్పడ్డారని ఫిర్యాదు

**బెజ్జూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

బెజ్జూర్ మండలంలోని చిన్న సిద్దాపూర్‌కు చెందిన టాకిరే వెంకటేష్ అనే దివ్యాంగుడు తన కుటుంబంపై కుల బహిష్కరణకు పాలపడ్డారని ఆరోపిస్తూ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కిరాణా దుకాణం నిర్వహిస్తున్న వెంకటేష్ కుటుంబ పోషణ భారంగా ఉండటంతో మద్యం కూడా విక్రయిస్తున్నాడు. మద్యం విక్రయాలు నిర్వహించరాదని ఇటీవల గ్రామంలో దండోరా వేయించారు. అయినప్పటికీ ఆదివారం మళ్లీ మద్యం విక్రయించాడన్న కారణంతో సోమవారం కుల బహిష్కరణ చేయాలంటూ దండోరా వేయించినట్లు తెలిపాడు. ఎవరైనా అతని దుకాణానికి వస్తే లక్ష రూపాయల జరిమానా విధిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారన్నాడు. దీనిపై బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌తో పాటు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్సై తెలిపారు. దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

## బార్లు, వైన్స్‌లు, తెల్లకల్లు దుకాణాలు బంద్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల సంద ర్భంగా పట్టణ పరిధిలో మద్యం షాపులు మూ సివేస్తున్నట్లుగా ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు.ఈ మేరకు సోమవారం సాయం త్రం పట్టణంలోని బార్లు, వైన్స్ షాపులను ఎక్సై జ్ అధికారులు మూసివేయించారు. మున్సి పల్ పరిధిలో మంగళ, బుధవారాల్లో షాపులు బంద్ ఉంచాలని పేర్కొన్నారు. అలాగే ఈనెల 13న కౌంటింగ్ రోజు కూడా పట్టణంలోని 11 బార్లు, 10 వైన్స్లు, తెల్లకల్లు దుకాణాలు బంద్ పాటించాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు షాపులు తెరువ వద్దని, నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## దాడిలో యువకుడి మృతి

### న్యాయం చేయాలంటూ కుటుంబసభ్యుల రాస్తారోకో, ఆందోళన

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ప్రైవేటు బ్యాంకులో గ్రూపు డబ్బుల విషయంలో జరిగిన గొడవలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల మేరకు వెంకట్రావుపేటకు చెందిన నాతరి ప్రశాంత్ (30) తల్లి నాతరి భాగ్యఓ ప్రైవేటు బ్యాంకులో గ్రూపులోన్ తీసుకుంది. గతే డాది డిసెంబర్‌లో సభ్యురాలు సువర్ణకు కిస్తీ డబ్బులు చెల్లించింది. విషయం తెలియని ప్రశాంత్ కూడా రూ.980 ఫోన్‌పే చేశాడు. డిసెంబర్ 2న ప్రశాంత్ వెళ్లి అడుగగా అక్కడే ఉన్న మరో సభ్యురాలు సంధ్యతో వాగ్వాదం జరిగింది. అక్కడే ఉన్న సంధ్య బంధువులు బైరం దినకర్, బైరం కృపాకర్ దాడికి దిగారు. అదేరోజు సాయంత్రం దాసరి సురేష్, బైరం దినకర్, బైరం కృపాకర్ మళ్లీ దాడి చేయడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈనెల 8న ప్రశాంత్ కిందపడిపోవడంతో కుటుంబ సభ్యులు ముందుగా స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి మంచిర్యాలకు, అనంతరం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

**న్యాయం చేయాలని రాస్తారోకో...**

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆందోళనకు దిగారు. సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించడంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచింది. సీఐ రమణామూర్తి, ఎస్సై గోపతి సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుని తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## అలుగు పొలుసులు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ఆయుర్వేదిక్ మందుల పేరుతో అలుగు పొలుసులను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు పెంచికల్‌పేట ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాకు చెందిన ఆరుగురు వ్యక్తులు గతేడాది డిసెంబర్ ఎల్కపల్లికి వచ్చారు. అటవీ జంతువుల పొలుసులు, గోర్లు, వెంట్రుకలతో మందులను తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి అలుగు పొలుసులు, వెంట్రుకలు, గోర్లను స్వాధీనం చేసుకున్నారు. పరీక్షల నిమిత్తం నాగ్‌పూర్ ల్యాబ్‌కు పంపించగా వారి వద్ద లభ్యమైన పొలుసులు అంతరించిపోతున్న అలుగు పొలుసులుగా నిర్ధారించారు. సోమవారం కొండేటి వెంకటేష్, ఇంగ్లే రాజన్నను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**



మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11న జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్ లో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పి.ఓ., ఎ.పి.ఓ. లకు నిర్వహించిన శిక్షణకార్యక్రమానికి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి హాజరై ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్‌గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరుగకుండా అన్ని జాగ్రత్త లు పాటించాలని, పోలింగ్ ముగిసిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవ లసిన నియమాలపై వివరించారు. పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించా రు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క రూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

## గ్రీవెన్స్ దరఖాస్తులు పరిష్కరించాలి

### ఐటీడీఏ పీఓ యువరాజ్ మార్మాట్

**ఉట్నూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ప్రతీ సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను పీఓ స్వీకరించారు. ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామానికి చెందిన దుర్గం ధర్మయ్య తనకి ఉన్న భూమికి పట్టా మంజూరు చేయాలని, ఇంద్రవెల్లి మండలం మార్కగూడ గ్రామానికి చెందిన దేవరావు వ్యవసాయ భూమిలో సాగు నీటి కోసం బోర్వెల్ వేయాలని, నార్నూర్ గ్రామానికి చెందిన సరిత తాను నిరుపేద కుటుంబానికి చెందిన వారిని అని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కొరకు అర్జీ, ఉట్నూర్ మండలం రామగూడ గ్రామానికి చెందిన మారుతీరావు తాను వికలాంగుడనీ వికలాంగ కింద పింఛన్ మంజూరు చేయించాలని అర్జీ కోరారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మం జూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధిం చిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# తీర్థయాత్రికుల కొరకు ప్రత్యేక రైళ్ళు

## ఐఆర్‌సిటిసి టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్

**మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
తీర్థ యాత్రలకు వెళ్ళే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సిటిసి టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి యం. కృష్ణమూర్తి, రైల్వే శాఖ అధికారులతో కలిసి రైల్ టూర్ ప్యాకేజెస్ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం మార్చి 21, ఏప్రల్ 14 తేదీ లలో 2 ప్రత్యేక ప్యాకేజీలను "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు" ద్వారా హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్యాకేజీలో మార్చి 21వ తేదీన ప్రారంభమై 28వ తేదీ వరకు దివ్యదక్షిణయాత్ర జ్యోతిర్లింగంతో (తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు) ఉంటుందని. ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14 వేల 700 రూపాయలు, 3 ఎ.సి. ధర 22 వేల 300 రూపాయలు, 2 ఎ.సి. ధర 28 వేల 700 రూపాయలుగా ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా కొనసాగుతుందని తెలిపారు. 2వ ప్యాకేజీలో ఏప్రల్ 14వ తేదీన ప్రారంభమై 24 వ తేదీ వరకు సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర ఉజ్జయిని (మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్) ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్ (సోమనాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గృష్ణేశ్వర్) ఉంటుందని, ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 17 వేల 600 రూపాయలు, 3 ఎ.సి. ధర 26 వేల 700 రూపాయలు, 2 ఎ.సి. ధర 34 వేల 600 రూపాయలుగా ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి ;నిజామాబాద్ ధర్మాబాద్; ముద్ఖేడ్ హజూర్ సాహిబ్ నాందేడ్; పూర్ణ మీదుగా కొనసాగుతుందని తెలిపారు. రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితమని తెలిపారు. ప్రతి రైలులో 639 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతి 70 మందికి ఇద్దరు సమన్వయకర్తలు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకురుస్తారని, కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్, రైలులో సి.సి. కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలిపారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030727, 9281030759లకు సంప్రదించాలని, మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని వారు తెలిపారు.

# ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు తప్పిన ప్రమాదం

## ఎమ్మెల్యే కారు మీదకు దూసుకొచ్చిన బస్సు

**మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు పెనుప్రమాదం తప్పింది. సోమవారం ఆయన మంచిర్యాల జిల్లా కేంద్రంలో పర్యటించారు. మంచిర్యాల బస్ స్టాప్ దగ్గర ఆ కాన్వాయ్ మీదకు ఓ బస్సు అతివేగంగా దూసుకొచ్చింది. దీంతో ఆయన కాన్వాయ్‌లోని వాహనాలన్నీ ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఎమ్మెల్యే కాన్వాయ్ డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆర్టీసీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉంటే.. కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. నల్లగొండ మండలం చర్లపల్లిలో జరిగిన కారు ప్రమాదంలో లాస్య నందిత మృతిచెందారు. ఆమె మరణానంతరం కంటోన్మెంట్‌లో జరిగిన ఉపఎన్నికలో శ్రీగణేశ్ విజయం సాధించారు.



# విద్యార్థులకు చట్టాలపై అవగాహన




**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
పెంచికలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల ప్రమాదాలు, బాల్యవివాహాలు, రోడ్డు భద్రత, మహిళల రక్షణ, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్ అంశాలతో పాటు హెల్ప్‌లైన్ నంబర్లు 1930, 100, 1098 వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువతలో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ లక్ష్మి, కానిస్టేబుల్ సురేశ్, కళా బృంద సభ్యులు రోహిత్, రాంచందర్ పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యార్థం పిచ్చి మొక్కల తొలగింపు

**కాసిపేట, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి భక్తులు వచ్చే మార్గంలో ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను పంచాయతీ అధికారులు తొలగించారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కోమటిచేను గ్రామ పంచాయతీ పరిధిలోని వరిపేట శివారు మీదుగా శివాలయం వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా భారీగా పిచ్చి మొక్కలు భారీగా పెరిగాయి. ఈ కారణంగా ఆలయానికి వచ్చే భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై పెరిగిన పిచ్చి మొక్కలను సోమవారం జేసీబీ (జీజదీ)తో పూర్తిగా తొలగించి రాకపోకల సమస్యను పరిష్కరించారు. సర్పంచ్ జాడి మాణిక్య శంకరయ్య, ఉప సర్పంచ్ కొడప అనంత రావు, వార్డ్ సభ్యులు సరోజ, గుండేటి నర్సయ్య, న్యాయవాది, నాయకులు మాసు సుధాకర్, మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దుర్గం గణేశ్, శంకర్, నరేష్, తదితరులు పనులను పరిశీలించారు.







# ఉపాధి హామీ పనుల ప్రారంభం

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను సోమవారం సర్పంచ్ రాంచందర్ ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి దోహద పడే ఈ పనుల ద్వారా గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనిల్, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్, నాగేష్,మధుకర్,ప్రభాకర్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రం తనిఖీ

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్ పరీక్షల కేంద్రాన్ని డిఐఈఓ జాదవ్ గణేష్ కుమార్ సోమవారం అకస్మిక తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షలకు 50 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



# బీఆర్ఎస్ నేతల ఇంట్లో తనిఖీలు





**చెన్నూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
చెన్నూరు మున్సిపాలిటీలో రాక్షస పాలన నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాలతోనే బీఆర్ఎస్ నాయకుడు మల్లేశం గౌడ్ ఇంట్లో ఎన్నికల అధికారులు, పోలీసుల తనిఖీలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. మల్లేశం గౌడ్ ఇంట్లో సోదాలు చేస్తున్న అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మంత్రి వివేక్ పంపిస్తేనే వచ్చి అధికారలు సోదా చేస్తున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో డబ్బులు, మందు సీసాలు ఉన్నాయని, కానీ అవి పోలీసులకు, అధికారులకు కనపడవని ఆయన ధ్వజమెత్తారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు కాంగ్రెస్ సర్కార్, మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని బాల్క సుమన్ విమర్శించారు.



## బాసర ఆలయానికి
# రూ.1.55కోట్ల ఆదాయం

**ముథోల్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పరిసరాల్లో వివిధ దుకాణాలకు సోమవారం అధికారులు బహిరంగ, సీల్డ్ టెండర్లు నిర్వహించారు. ఘాట్ వద్ద పూజా సామగ్రి విక్రయానికి రూ.35.11 లక్షలు, ఆలయ ఆవరణలోని దుకాణానికి రూ.38.88 లక్షలు, వెయ్యి రూపాయల అక్షరాభ్యాస మండపంలో భక్తుల ఫొటోలు తీసేందుకు రూ.40.16 లక్షలు, 150 రూపాయల మండపంలో ఫోటోలు తీసేందుకు రూ.41.70 లక్షలకు వ్యాపారులు టెండర్లు దక్కించుకున్నారు. 4 విభాగాల్లో జరిగిన వేలంలో ఆలయానికి రూ.1,55,85,888 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో అంజనాదేవి తెలిపారు. బాసర ఆలయంలో నేడు నిర్వహించనున్న హుండీ లెక్కింపును అనివార్య కారణాల వల్ల వాయిదా చేసినట్లు ఈవో అంజనాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రెండుసార్లు వాయిదా పడినట్లు ఆమె పేర్కొన్నారు.

## ఉత్సాహంగా జిల్లా స్థాయి
# సీఎం కప్ క్రీడా పోటీలు



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో సోమవారం జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథులుగా జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. కరాటే, జూడో, బేస్ బాల్, సైక్లింగ్, చదరంగం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ప్రారంభించారు. అంతకుముందు వారు మాట్లాడుతూ గతేడాది ఆదిలాబాద్ జిల్లా పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిందని, ఈ సారి కూడా అదే స్ఫూర్తితో అత్యధిక పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా క్రీడా సంఘాల బాధ్యులు దయానంద రెడ్డి, సాయికుమార్, స్వామి, హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల దృష్ట్యా పాఠశాలలకు
# రెండు రోజులు సెలవు

**మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పాఠశాలలకు రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య తెలిపారు. ఈ నెల 11న ఎన్నికలు జరుగనుండ గా ముందు రోజు సిబ్బంది ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని నియ మించడంతో గ్రామీణ ప్రాంతంలో పాఠశాలల నిర్వహణ కష్టమని పలువురు ఎంఈవోలు, హెచ్ఎంలు నివేదించారు. కలెక్టర్ కుమార్ దీపక్ సూచన మేరకు గ్రామీణ ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలకు ఈ నెల10, 11న సెలవు ప్రకటించారు. వీటికి బదులుగా గ్రామీణ ప్రాంతంలో పనిచేసే అన్ని పాఠశాలలు రెండో శనివారం (14న) పనిచేస్తా యని ఆయన తెలిపారు.

# వేర్వేరు చోట్ల మద్యం పట్టివేత





**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని కొత్త కుమ్మరివాడ కాలనీలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 70(క్వార్టర్) మద్యం బాటిళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎఫ్ఎస్టీ బృందంతో కలిసి రామిలి పోశెట్టి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా మద్యం నిల్వలు గుర్తించామన్నారు. వాటి విలువ సుమారు రూ.7,699 ఉంటుందన్నారు. ఎఫ్ఎస్ఎ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, మల్టీ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**మద్యం తరలిస్తున్న పలువురి అరెస్టు...**
ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా మద్యం తరలిస్తున్న పలువురిపై సోమవారం కేసులు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపారు. భోరజ్ మండలంలోని పూసాయికి చెందిన నలిమెల సాయికిరణ్ వద్ద నుంచి 24.3 లీటర్లు, పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన షేక్ సమీర్ వద్ద 6.58 లీటర్లు, అర్లిలో తొడసం రమేష్ వద్ద 7.74 లీటర్లు, ఖానాపూర్‌కు చెందిన పోటిపెల్లి శివకుమార్ వద్ద 3.24 లీటర్లు, న్యూహౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జాదవ్ కిరణ్‌కుమార్ వద్ద 3.30 లీటర్లు, ఆదిలాబాద్‌లోని బంగారుగూడకు చెందిన సీలంవార్ గజానన్ వద్ద 2.5 లీటర్లు, రవీంద్రనగర్‌కు చెందిన సుంకు రఘు వద్ద 3.24 లీటర్లు, శాంతినగర్‌కు చెందిన మహ్మద్ ముస్తఫా వద్ద 15.60 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పలువురు మద్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

**దేశీదారు పట్టివేత...**
భోరజ్ మండలంలోని గిమ్మ శివారులో సోమవారం దేశీదారు పట్టుకున్నట్లు ఎస్సై పవర్ గౌతమ్ తెలిపారు. జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా రాంపూర్‌కు చెందిన సినారె వినోద్, ఉట్ల ప్రవీణ్ ఎక్సెల్ వాహనంపై సంచితో అనుమానాస్పదంగా కనిపించారు. సంచిని తనిఖీ చేయగా 240 లీటర్ల 90ఎంఎల్ దేశీదారు బాటిళ్లు లభించాయి. వాటి విలువ రూ.12వేలు ఉంటుందన్నారు. మహారాష్ట్రలోని చేనాక నుంచి తెచ్చినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**ఆసిఫాబాద్‌లో...**
జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో అక్రమంగా నిలువుంచిన మద్యం బాటిళ్లను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని శ్రీ లక్ష్మి హోటల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో హోటల్లో తనిఖీ చేపట్టగా రూ.8 7,720 విలువైన మద్యం లభ్యమైనట్లు తెలిపారు. యజమాని రంజిత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి చేకూరిందేమీ లేకపోగా ఆర్థిక విధ్వంసం జరిగిందని విమర్శించారు. సింగరేణి సీఎస్ఆర్, డీఎంఎఫ్ఎ నిధులను ఈ ప్రాంతం అభివృద్ధికి ఖర్చు చేయకుండా హరీశ్ రావు వంటి వారు వారి ప్రాంతంలో స్టేడియంలు నిర్మించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక కొత్త గనుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ దక్కాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, రాజు, నీలం శ్రీనివాస్ గౌడ్, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టైగర్‌జోన్ అడ్డంకులు తొలగించాలి



**ఉట్నూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
టైగర్ జోన్ అడ్డంకులు తొలగించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సమస్యలు పరిష్కరించకుంటే ఆమరణ దీక్ష చేయాల్సి వస్తుందని ఆదివాసీ కోలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొడప సోనేరావు హెచ్చరించారు. ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్‌ను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అటవీ అడ్డంకులు తొలగించడంతో పాటు ఆదివాసీ గిరిజనుల ఆలయాలను రక్షించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ గిరిజనులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలను పీవో దృష్టికి తీసుకువెళ్లగా ఈ నెల 20న సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని సోనేరావు వివరించారు. భీంరావ్, రాజు, తదితరులున్నారు.



# ముగిసిన పోస్టల్ బ్యాలెట్ గడువు
## ఓటు హక్కు వినియోగించుకున్న 435 మంది

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ గడువు సోమవారంతో ముగిసింది. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఈ నెల 6 నుంచి ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. నాలుగు రోజుల్లో 435 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో 52 మంది సర్వీస్ ఓటర్లతో పాటు ఇతర మరో ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్‌ను వారి చిరునామాకు పంపించారు. ఈ బ్యాలెట్ పత్రాలు కౌంటింగ్‌కు ముందు రోజు వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి చేరేలా చూడాల్సి ఉంటుంది. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌ను ప్రత్యేక గదిలో భద్రపరిచి సీల్ వేశారు. వాటిని ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ కేంద్రానికి తరలించనున్నట్లు ఎన్నికల నోడల్ అధికారి ఫణిందర్‌రావు తెలిపారు.

## హత్య కేసులో నిందితుడికి
# యావజ్జీవ కారాగార శిక్ష

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి ప్రభాకర్ రావు సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన బగనూరే జ్ఞానేశ్వర్ అదృశ్యమైనట్లు 2020 నవంబర్ 8న ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జాదవ్ శ్రీనివాస్, సిందే అచ్యుత్, సిందే గోవిందావు, సిందే రాంకిషన్ కలిసి జ్ఞానేశ్వర్‌ను ఇచ్చోడలో హత్య చేసి మహారాష్ట్రలోని పిప్పల్గావ్ ఘాట్‌లో పడేసినట్లు విచారణలో తేలింది. అప్పటి సీఐ నిందితులను అరెస్టు చేసి రిమాండు తరలించారు. నేరం రుజువుకావడంతో జీవితఖైదు విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

# మొదలైన తాయిలాల పంపిణీ



- ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం
- ఇక మిగిలింది ఓటరు నాటి పట్టడమే
- తాయిలాల పంపిణీయే తరువాయి
- అన్ని పార్టీల ఉరుకులు పరుగులు
- అభ్యర్థులకు వచ్చే 24 గంటలు కీలకం

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. వారంరోజుల పాటు పట్టణాల్లో వాడవాడల మైకుల హోరు, ర్యాలీల జోరుకు సోమవారం సాయంత్రం బ్రేక్ పడింది. పోలింగ్‌కు 24 గంటల గడువు మాత్రమే ఉండటంతో అభ్యర్థుల్లో దడ మొదలైంది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రదాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఇతర పార్టీల నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రచార పర్వంలో ఢీ అంటే ఢీ అని తలపడ్డ అభ్యర్థులంతా ఇక ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. వాడవాడలా ఓటర్లను తమవైపు తీప్పుకునేందుకు ప్రలోభాల పర్వాన్ని ప్రారంభించారు. మందు, విందు, పచ్చనోట్లతో అకట్టుకునేం దుకు అఖరి ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా అభ్యర్థుల స్థాయిని బట్టి ఒక్కో ఓటరుకు 1000 రూపాయల నుంచి 1500 రూపాయలు పంపిణీ చేస్తుండగా ఆర్థికంగా కొంత బలహీనంగా ఉన్న అభ్యర్థులు ఓటుకు 500 రూపాయలు ఓటరు స్లిప్‌లతో పాటు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని పార్టీలకు వచ్చే 24 గంటలు కీలకంగా మారడంతో సామాజిక లెక్కల కాగితాలను పట్టుకొని అభ్యర్థులు వారి అనుచరులు మున్సిపాలిటీలలోని ప్రతీ వార్డు ప్రతీ ఓటరు తలుపు తడుతున్నారు.

**కుల సంఘాలకు భళే గిరాకీ ...**
ఎన్నికల ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడడంతో అభ్యర్థులంతా వార్డుల్లో కులాల వారీగా ప్రభావం చూపగల కుల నాయకుల ను బుట్టలో వేసుకునేందుకు అన్నిరకాల ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పార్టీలు కుల సంఘాల పెద్దలను బుట్టలో వేసుకునేందుకు పెద్దఎత్తున తాయిళాలను ప్రలోభ పెడుతున్నారని తెలుస్తోంది. కులాల వారీగా ఓటర్లను విభజించి ఆయా కులాలకు సంబంధించిన ఓట్లను గంపగుత్తగా పార్టీకి వేయించేందుకుగాను పెద్దమొత్తంలో డబ్బులు ముట్టజెప్పుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొంత మంది అభ్యర్థులు పంపిణీ చేసినప్పటికీ అన్నిపార్టీల అభ్యర్థులు అనుకూల, ప్రతికూల సామాజికవర్గాల లెక్కలను చేతిలో పట్టుకుని వారిని బుట్టలో వేసుకునేందుకు పావులు కదుపుతున్నారు.

**జిల్లాలో 65,132 మంది ఓటర్లు..**
జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆసిపాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా 94 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో 13,927 మంది ఓటర్లు ఉండగా పురుషులు 6,822, మహిళలు 7,103, ఇద్దరు ఇతరులు ఉన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉండగా 130 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో 51,205 మంది ఓటర్లు ఉండగా పురుషులు 25,004, మహిళలు 26,193, ఇతరులు ఎనిమిది మంది ఉన్నారు.

**ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు..**
మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. దీంతో ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఉండటంతో అందుకు సంబంధించిన ఏర్పాటు పనులను అధికారులు చేపడుతున్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, అందులోనే కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉండగా 85 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణం లోని డీఏవీ పాఠశాలలో మున్సిపల్ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, కౌంటింగ్ కేంద్రంను ఏర్పాటు చేశారు. సోమవారం అయా కేంద్రాలను కలెక్టర్ కె హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో పరిశీలించారు.

# ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్పీ నితికా పంత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ముగిసిందని, పోలింగ్‌కు సంబంధించి అధికారులు, సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. ప్రలోభాలను అడ్డుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పోలింగ్‌కు ముందు లేదా పోలింగ్ రోజున ఓటర్లను ప్రభావితం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి సమాచారం ఉన్నా స్థానిక ఎన్నికల అధికారులు లేదా కంట్రోల్ రూంకు తెలియజేయాలని కోరారు. ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్కు పకడ్బందీ బందోబస్తు, నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్లాగ్ మార్చ్ పట్టణంలోని పలు కూడళ్ల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో సీఐలు



ప్రేమ్ కుమార్, సంతోష్, కుమారస్వామి, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.



## బెజ్జూర్ రేంజ్‌లోని నాచురల్ ఫారెస్ట్‌ను సందర్శించిన అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్

**బెజ్జూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ ఫారెస్ట్ సెక్షన్ ట్రైనీ రేంజ్ పరిధిలో గల ఇందర్గం బీట్‌లో గల నేచరల్ టీక్ ఫారెస్ట్ ను అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ వంశీకృష్ణ సోమవారం సందర్శించారు. అటవీ క్షేత్ర పర్యటనలో భాగంగా బెజ్జూర్ రేంజ్‌లో ఇంద్రగం బీట్‌ను సందర్శించారు. రాముడు బీ ముడు చెట్ల గురించి అటవీ సంరక్షణలో తీసుకుంటున్నా చర్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కుష్ణపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, ఎఫ్‌బిఓ అనిల్, బేస్ కాంప్ వాచర్స్ పాల్గొన్నారు.

## ఐటీడీఏ టూర్ ప్రోగ్రామ్

**నిర్మల్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో టూర్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నారు. పీఎం శ్రీ పథకం కింద కేస్లాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యూటీ, వెల్నెస్‌పై అవగాహన కల్పించేందుకు ఆదిలాబాద్ టూర్ నిర్వహించారు. బోటిక్ శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు సృజనాత్మక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజ, కళ్యాణి, శ్యాంసుందర్, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.



## ఇందారంలో కార్మికుల ఆందోళన

**జైపూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం ఐకే-1 ఓపెన్ కాస్ట్ గనిలో వారాహి కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం ఆందోళన నిర్వహించారు. వారికి రావలసిన నెల జీతంతో పాటు బోనస్ ఇవ్వకుండా చేతులెత్తేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓసి నుంచి రాత్రికి రాత్రి మెషిన్లు తరలిస్తున్నారని డ్రైవర్లు, క్యాంపు సిబ్బంది ఆరోపించారు. వారాహీ కంపెనీ భాగస్వాముల మధ్య సఖ్యత లోపించి, ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఒప్పందం ప్రకారం నిర్దేశించిన బొగ్గు, మట్టి పనుల లక్ష్యాలు పూర్తి చేయడం లేదని సింగరేణి అధికారులు ఇప్పటికే కంపెనీకి జరిమా నా విధించారని, దీనిని నష్టంగా చూపించి పనిచేసిన కార్మికులను నష్టపరచడం అన్యాయం అన్నారు.



## యువకుడి ఆత్మహత్య

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
ప్రేమించిన ప్రియురాలు తనకు దక్కదేమోనని మనస్తాపంతో ఓ ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బేల మండలం లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బేల మండల కేంద్రాని కి చెందిన నిపుంగే రూపేష్ (21) డిగ్రీ చదువుతున్నాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన తన క్లాస్ మెంట్ అమ్మాయిని ప్రేమించాడు. అయితే ఇటీవల అమ్మాయి కుటుంబీకులు వేరే అబ్బాయితో అమ్మాయికి వివాహం కుదిరిచారు. దీంతో ఆ యువకుడు తన ప్రేమికురాలు దూరం అవుతుందని తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మీరు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



# హీరాసుక జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీ ప్రధాన్ సమాజ్ ఆరాధ్య దైవమైన గురు హీరాసుక చూపిన సన్మార్గంలో నడవాలని ప్రధాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెస్రం మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన్ గూడలో హీరా సుక జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముం దుగా ఆదివాసి సంస్కృతి సంప్రదాయ ప్రకారం డోలు, సన్నాయి నడుమ పూజలు చేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గోండి ధర్మ గురు హీరసుక జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వ హించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంస్కృతి ప్రతిక గా భావితరాలకు అందించిన హీరసుక గొప్ప గురువు అన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మెస్రం శేషనారా యణ రాష్ట్ర నాయకులు తొడసం కేశవ్, గ్రామ పటేల్ గెడం జ్ఞానేశ్వర్, మాడవి శాంతరాజ్, మండల అధ్యక్షులు తొడసం సాగర్, గౌరవ అధ్యక్షులు గెడం భరత్, కనక గణేష్, సోయం రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించి.. ఆశీర్వదించండి

- కాంగ్రెస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం
- కార్నర్ మీటింగ్‌తో దద్దరిల్లిన పట్టణం
- మోసకారుల మాటలు నమ్మొద్దు
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ఖానాపూర్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ప్రచారం హోరెత్తింది.. మాజీ మంత్రి వేణుగోపాల చారి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముమ్మర ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని జగన్ చౌక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు వందలాది మంది జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రూ.25 కోట్ల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి ఈ పట్టణాన్ని మరింత సుదరంగా తీర్చిదిద్దుతామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, తాను నమ్మే జంగుబాయి దేవత మీద ప్రమాణం చేసి చెబుతున్నానని వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మునిసిపాలిటీలో ఉన్న 12 వార్డులలో మార్నింగ్ చేసి అక్కడ నెలకొన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఈరోజు రూ.25 కోట్ల నిధులను ఖానాపూర్ మున్సిపాలిటీకి మంజూరు చేయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కొరకే గతంలో ఇంద్రనగర్ కాలనీ ఇందిరమ్మ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిందే రాజీవ్‌నగర్ కాలనీ కాంగ్రెస్ ఇచ్చిందే గాంధీనగర్ కాంగ్రెస్ ఇచ్చిందే అంబేద్కర్‌నగర్ కాంగ్రెస్ ఇచ్చిందే టు బీహెచ్‌కే స్థలాన్ని కూడా కాంగ్రెస్ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇచ్చుడే తెలుసు కానీ మాయ మాటలు చెప్పడం రాదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఖానాపూర్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని అడ్డుకోవడానికి బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటయ్యాయన్నారు. దీంలో భాగంగానే పలు వార్డులో కలిసి పోటీ చేయడానికి చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆయన ఆరోపించారు. ఖానాపూర్‌ను దోచుకోవడానికి ఈ రెండు పార్టీలు కలిసి పని చేస్తున్నయన్నారు. ప్రజలు ఇది గమనించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. దేశం కోసం ధర్మం కోసం అని పెద్దపెద్ద మాటలు మాట్లాడాలని తప్ప చేసేది ఏమి లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిదవ వార్డ్ నుంచి దేశ సరిహద్దులలో దేశ రక్షణకు పని చేసిన అభ్యర్థికి టికెట్ ఇచ్చిందన్నారు. ఆరవ వార్డులో అమరుల్లాఖాన్‌ను రాజకీయ అనుభవం ప్రజలతో ఉండి రెండుసార్లు గెలుపొంది ప్రజలకు సేవ చేశాడని, రానున్న రోజుల్లో ఆ వార్డుకు కావలసిన నిధులను కేటాయించి అభివృద్ధి చేస్తానన్నారు. పట్టణంలో ఉన్న 12 వార్డులలో కోటిన్నర కోటిన్నర లక్షలు కేటాయించి ఉన్నాయని ఎన్నికల కోడ్ ముగిసిన తక్షణమే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తామని, ఆదివాసుల ఆరాధ్య దైవమైన జంగుబాయిపై ప్రమాణం చేసి చెబుతున్నానని ఆయన అన్నారు.

# కుమ్రంభీం జిల్లాలో మళ్లీ మావోయిస్టుల కలకలం

- ఆసిఫాబాద్ అడవుల్లో 'గెరిల్లా' అలజడి
- మహారాష్ట్ర నుంచి జిల్లాలో చొరబడిన దళం
- గత సర్పంచ్ ఎన్నికల సమయంలోనూ 16 మంది అరెస్టు
- మున్సిపల్ ఎన్నికల వేళ హైఅలర్ట్
- సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ బలగాల మోహరింపు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

కొమురంభీం జిల్లా అటవీ ప్రాంతాల్లో మరోసారి మావోయిస్టుల కదలికలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతం నుంచి ఓ మావోయిస్టు దళం జిల్లాలోకి ప్రవేశించినట్లుగా నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతోంది. ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో గ్రేహౌండ్స్ బలగాలు రంగంలోకి దిగాయి. డోర్లి-పంగిడిమాదారం అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా.. మావోయిస్టులకు సంబంధించిన కిట్ బ్యాగులు, ఇతర సామగ్రిని బలగాలు గు ర్తించాయి. పోలీసుల రాకను గమనించిన దళ సభ్యులు దట్టమైన అడవుల్లోకి తప్పించుకున్నట్లుగా అనుమానిస్తున్నారు.

**సరిహద్దుల్లో హై టెన్షన్..**

గ్రేహౌండ్స్ బలగాలతో పాటు స్థానిక పోలీసులు, స్పెషల్ పార్టీ బృందాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలను



కఠినతరం చేశారు. కొత్త వ్యక్తులు లేదా అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. తిర్యాణి మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల్లో పోలీసులు పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మావోయిస్టులకు ఎలాంటి సహకారం అందించవద్దని కోరుతున్నారు. 'ఆపరేషన్ కగార్'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న టార్గెట్ సమీపిస్తున్న తరుణంలో సరిహద్దు ప్రాంతాల్లో ఎప్పుడైన ఎదురు కాల్పులు జరగే అవకాశం ఉందని స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

**తిర్యాణి అడవుల్లో కూంబింగ్...**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై పోలీసులు నిఘా పెంచారు. తిర్యాణి అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం స్పెషల్ పార్టీ పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్ర నుంచి తెలంగాణ అటవీ ప్రాంతంలోకి మావోయిస్టులు ప్రవేశించినట్లు వచ్చిన నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. హైగ్రౌండ్ పోలీసులు అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టి జల్లెడ పడుతూ తనిఖీలు చేపడుతున్నారు. అనుమానాస్పద కదలికలపై డేగ కన్నుతో నిఘా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు చర్యలలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



## విద్యార్థులకు నాణ్యమైన విద్య

# పోషకాహారం అందించాలి

### ఐటిడిఏ పీఓ యువరాజ్ మార్మాట్

**కడెం, ఫిబ్రవరి 9 (ప్రభాత సమాచారం)**

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషకాహారం అందించాల్సిందిగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అధికారులను ఆదేశించారు. మంగళవారం దస్తురాబాద్, కడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కడెం (బాలూరు) గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, భోజన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి భోజన నాణ్యత, సమయపాలనపై ప్రశ్నించారు. వండిన ఆహారాన్ని పరిశీలించి కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. కడెం ఆశ్రమ పాఠశాలలో 170 మంది విద్యార్థుల్లో 115 మంది మాత్రమే హాజరై ఉండగా, హాజరు నమోదు తప్పుడు విధంగా చేయడంపై వార్డెన్‌ను హెచ్చరించారు. దస్తురాబాద్ పాఠశాలలో పల్స్ యాప్ అప్‌డేట్ చేయకపోవడం, నెట్‌వర్క్ కారణాలు చూపడం, తక్కువ మోతాదులో భోజనం అందించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పల్స్ యాప్ పనితీరుపై సమీక్షించి, సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారించేందుకు వసతి గృహాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

